

PRGI REGD No.: TGTEL/26/A6220

వాస్తవ నైజం

భారత్ టుడే

www.bharathtoday.net

My Nation- My Respect

Medchal Malkajgiri | Volume : 01 | Issue : 091 | Friday | 20-11-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



కొత్త నిబంధనలతో చేతినిండా డబ్బు

» పీఎఫ్ డబ్బుపై ఉద్యోగులకు ఫుల్ ఫ్రీడమ్!
» పొదుపు సొమ్ముపై సరికొత్త అధికారం
» రిటైర్మెంట్ తర్వాతా నెలనెలా డబ్బులు
» వ్యక్తిగత ఆర్థిక జీవితంలో కీలక మలుపు!

ఏళ్ల తరబడి చెమటోడ్చి సంపాదించిన జీతంలో కొంత భాగం.. ప్రతి నెలా పీఎఫ్ ఖాతాలో జమ! అవసరమొచ్చినా నిబంధనల గోడలు.. అత్యవసర పరిస్థితుల్లోనూ సొంత డబ్బు కోసం ఎదురుచూపులు! ఇక ఆ కష్టాలకు తెరపడనుందా? ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తీసుకున్న తాజా నిర్ణయాలు దేశవ్యాప్తంగా ఉద్యోగుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటివరకు పీఎఫ్ ఖాతాలో తప్పనిసరిగా ఉంచాల్సిన కనీస నిల్వ 25 శాతం.. ఇకపై 10 శాతానికి తగ్గనుంది. అంటే అర్హత మేరకు ఏకంగా 90 శాతం సొమ్ము చేతికి వచ్చే అవకాశం! అంతేకాదు.. రిటైర్మెంట్ తర్వాత పీఎఫ్ డబ్బు కోసం ఒకేసారి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా నెలనెలా, మూడు నెలలకోసారి, ఆరు నెలలకోసారి పొందే కొత్త వెసులుబాటు కూడా రాబోతోంది. ఉద్యోగం కోల్పోయిన వారికి మరో ఊరట.. పీఎఫ్ తుది సెటిల్‌మెంట్ కోసం 12 నెలలు వేచిచూడాల్సిన గడువు రెండు నెలలకు తగ్గనుంది. అసలు ఈ మార్పుల వెనుక ప్రభుత్వ ఆలోచన ఏమిటి? ఉద్యోగుల చేతికి వచ్చే అదనపు నగదు మార్కెట్‌ను ఏ మేరకు ప్రభావితం చేయనుంది? భవిష్యత్తు భద్రతకు ఈ నిర్ణయాలు ఎంతవరకు ఉపయోగపడతాయి? ఉద్యోగుల పీఎఫ్ జీవితంలో కొత్త అధ్యాయం ఎలాంటి మార్పులు తీసుకురానుంది.



రాజన్న స్టైలే వేరబ్బా..!

రేవంత్ లాజిక్.. రివర్స్ ఎటాక్

» సీఎం చేస్తే తప్పు.. సీఎం చేస్తా ఒప్పా..!?
» రూల్ ఈజ్ రూల్.. రూల్ ఫర్ ఆల్
» కొత్త అస్త్రంతో రేవంత్‌ను ఫిక్స్ చేస్తారా?
» హైకమాండ్ ముందు అడ్డంగా ఇరికించే స్టాటజీ
» మోదీపై గుజరాత్ అస్త్రం.. కొడంగల్‌పై రాజన్న బ్రహ్మాస్త్రం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనదైన వ్యూహంతో ముందుకు సాగుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఇప్పటివరకు ముఖ్యమంత్రి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన రాజగోపాల్‌రెడ్డి.. ఇకపై అదే అంశాన్ని రాజకీయ అస్త్రంగా మలుచుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్న రాజకీయ సిద్ధాంతంతోనే ముఖ్యమంత్రి నిలదీస్తూ.. తన వాదనకు బలం చేకూర్చాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని రేవంత్ కోరుతున్నప్పుడు, తెలంగాణలోని అన్ని నియోజకవర్గాలకు ముఖ్యమంత్రి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారా అన్న వాదనను తెరమీదకు తెచ్చేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొత్త వాదనను తెరమీదకు తెచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. తాజాగా రేవంత్ రెడ్డి, మునుగోడుకు నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని బహిరంగ విమర్శలు చేసిన రాజగోపాల్.. ఈసారి లాజిక్‌తో సీఎంను కార్నర్ చేసేందుకు వ్యూహం సిద్ధం చేసినట్లు సమాచారం. తాను విన్పిస్తున్న వాదన, ధిక్కార స్వరం కాదని... గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొడంగల్‌కు అన్యాయం చేశారని.. రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను స్ఫూర్తిగా తీసుకొని, తానిప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు రాజగోపాల్ రెడ్డి ట్విస్ట్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. ఈ లాజిక్ ద్వారా, కోమటిరెడ్డి ఒకే దెబ్బకు మూడు పిట్టలను కొట్టినట్లు అవుతుందని భావిస్తున్నట్లు సమాచారం. రేవంత్ రెడ్డితోపాటు, తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని మోదీని, గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపారని కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ.. కీలక పదవుల్లో ఉన్న వారందరినీ రాజగోపాల్ నిలదీయాలని రాజగోపాల్ రెడ్డి భావిస్తున్నారు. తాను పార్టీ ధిక్కరణకు పాల్పడటం లేదని ముఖ్యమంత్రి పాలనకు సంబంధించి సూచనలు హక్కు... తెలంగాణలోని ప్రతి పౌరుడికి ఉంటుందని.. అదే తరహాలో మునుగోడు ప్రజల పక్షాన తాను ఈ వాదన విన్పిస్తున్నానని.. రాజగోపాల్ రెడ్డి తన వైఖరిని సమర్థించుకోనున్నట్లు తెలుస్తోంది. పొలిటికల్ లీడర్‌కి కసి ఉంటే చాలదు.. కంటెంట్ ఉండాలి అనే విషయం తమ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేస్తున్న వాదనను వింటే అర్థమవుతుందని మునుగోడు వాసులంతా చర్చించుకుంటున్నారు.

క్రమశిక్షణపై అందరికీ ఒకే నిబంధన

పరిశీలిస్తున్న అధిష్ఠానం
రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై నజర్!



కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యల వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్పందించారు. రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్ చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం గమనిస్తోందని, ఈ అంశాలపై సమగ్రంగా పరిశీలన జరుగుతోందని తెలిపారు. (వివరాలు 2లో..)



రేవంత్ రూటే సెపరేటు

• సిద్దిపేట పొలిటికల్ బ్లాస్టింగ్
• ప్రత్యర్థులు, సొంత పార్టీ నేతలపై యుద్ధం

కుటుంబాలకు భరోసాగా ఇందిరమ్మ బీమా

సిద్దిపేట అభివృద్ధికి రూ.544 కోట్ల వరాలు

సిద్దిపేట గడ్డపై ప్రజా సంక్షేమానికి మరో కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహచర మంత్రులతో కలిసి ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం ఎదురైనా ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

త్వరలో బీజేపీలోకి హరీశ్‌రావు

రేవంత్ సంచలన బాంబు!
దమ్ముంటే కాదని ఒట్టేసి చెప్పు
సిద్దిపేట వేదికగా సీఎం సవాల్

తెలంగాణ రాజకీయాల్లో సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి రాజకీయ బాంబు పేల్చారు.మాజీసీఎంకేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీమంత్రులు కేటీఆర్,హరీశ్‌రావులపైనిప్పులు చెరిగారు. ముఖ్యంగా హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ, ఆయన బీజేపీలోకి వెళ్లే అంశాన్నిప్రస్తావించినట్లు రాజకీయ చర్చకు తెరలేపారు.

కోమటిరెడ్డికి పరోక్షంగా చురకలు!

మంచి చెవిలో.. చెడు మైక్‌లోనా?

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభలో పరోక్షంగా ఘాటైన స్పందన ఇచ్చారు. పార్టీలోని కొందరు నాయకులు బహిరంగంగా మాట్లాడుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెడు విషయాలను చెవిలో చెప్పాలని, మంచి విషయాలను మైక్‌లో అందరికీ వినిపించాలని వ్యాఖ్యానించారు. అయితే కొందరు నాయకులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా

2029లో మళ్లీ గెలుపు హస్తానిదే..!

సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ రాజకీయ పునరుజ్జీవనం మొదలైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోనే కాకుండా సిద్దిపేట గడ్డపైనా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని దీమా వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)

నీళ్ల పంచాయితీపై కేటీఆర్‌కు కౌంటర్!

• కృష్ణా జలాలపై పాత నిర్ణయాల ప్రశ్న

తెలంగాణకు సాగునీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందంటూ వస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభలో సమాధానమిచ్చారు.తాను తెలంగాణ బిడ్డనని, ఈ నేలపై పుట్టి ఇక్కడే పెరిగానని, రాష్ట్రప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎప్పుడూ వ్యవహరించబోనని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

హుస్నాబాద్ విలీనంపై పొన్నం పట్టుదల!



- కరీంనగర్‌లో కలపాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి
- జిల్లాల విభజనతో స్థానికంగా అసంతృప్తి

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమయంలో హుస్నాబాద్ నియోజకవర్గాలను సిద్దిపేట,హనుమకొండ, కరీంనగర్ జిల్లాల్లో విభజించారు. ఈ నిర్ణయంపై అప్పట్లో స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల్లో ఉండటంతో పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. (వివరాలు 2లో..)



కాంగ్రెస్ నేతలే అవినీతి బయటపెడుతున్నారు!

రైతుల కన్నీళ్లు కనిపించవా..
సీఎంపై కేటీఆర్ ఫైర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు.రాష్ట్రంలో రైతులు కరువు, సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి మాత్రం చిల్లర మాటలతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల బాధలను పట్టించుకోవాల్సిన బాధ్యతగల ముఖ్యమంత్రి ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలకు దిగడం ఏమిటని ప్రశ్నించారు. (వివరాలు 2లో..)



కేసీఆర్ పథకాలు ఎక్కడ?

ప్రగల్భాలు తప్ప ప్రజా ఎజెండా ఏది?
సీఎం రేవంత్ ప్రసంగంపై హరీశ్ ఫైర్

సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. గంటకు పైగా సాగిన ప్రసంగంలో రాజకీయ విమర్శలు, వ్యక్తిగత వ్యాఖ్యలు తప్ప ప్రజా సమస్యలపై స్పష్టమైన ప్రస్తావన లేదని విమర్శించారు. కరువు కోరల్లో చిక్కుకున్న రైతుల కష్టాలు, సాగునీటి ఇబ్బందులపై ముఖ్యమంత్రి కనీసం స్పందించలేదని ఆరోపించారు. సిద్దిపేటలో నిలిచిపోయిన రూ.1,070 కోట్ల పెండింగ్ అభివృద్ధి పనుల గురించి మాట్లాడకుండా ప్రసంగం ముగించారని మండిపడ్డారు. (2లో..)



రేవంత్ సర్కారుపై రాజాసింగ్ ఫైర్!


రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలకు మద్దతు
నిధుల కేటాయింపులో వివక్షపై విమర్శలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన విమర్శలకు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు పలికారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల విడుదలలో వివక్ష చూపుతున్నారన్న ఆరోపణల్లో తప్పేమీ లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలకే నిధులు విడుదల చేస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి గతంలో విమర్శించారు. (వివరాలు 2లో..)




ఎన్నికల బహిష్కరణ ప్రజాస్వామ్యానికి ప్రమాదం

ప్రజాస్వామ్యంపై విశ్వాసంతోనే పోరాటం: రాహుల్



రోడ్డు ప్రమాదాలపై మంత్రి ఆవేదన!

- ఘటనలు కన్నీరు పెట్టిస్తున్నాయ్
- ఏటా 1.80 లక్షల మరణాలు
- ఇంజినీర్లకు నితిన్ గడ్కరీ సూచనలు



బిర్యానీ బాంబు అంబర్‌పేటలో కలకలం..

- మండి బిర్యానీతో మొదలైన ముప్పు
- ఒకే కుటుంబంలో తొమ్మిది మందికి అస్వస్థత!
- ఐదుగురు చిన్నారులకూ వాంతులు, విరేచనాలు



పరిశ్రమలపై మోదీ అసంతృప్తి

ఉత్పత్తి నుంచి ఉపాధి వరకు ప్రశ్నలు

దేశీయ పరిశ్రమల పనితీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తయారీ రంగంలో స్వయం సమృద్ధి, ఉద్యోగాల కల్పన, వేతనాల పెంపు, ఉత్పత్తుల నాణ్యత, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వినియోగంలో పరిశ్రమలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని విమర్శించారు. నవంబర్ 19న ఢిల్లీలో ఫిక్కీ శతాబ్ది వార్షిక సమావేశ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన పారిశ్రామిక వేత్తలకు పలు అంశాలపై ప్రశ్నలు సంధించారు. (వివరాలు 3లో..)



స్టాలిన్‌ను ఓడించిన ఎమ్మెల్యే కన్నుమూత

గుండెపోటుతో వీఎస్ బాబు మృతి

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కొలత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఓడించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎమ్మెల్యే వీఎస్ బాబు గురువారం (నవంబర్ 19) కన్నుమూశారు. (3లో..)



దోవల్‌కు అమెరికా కోర్టు సమన్లు

ఢిల్లీ కోర్టుల ద్వారా జారీకి ఆదేశాలు
హేగ్ ఒప్పందం ఆధారంగా నిర్ణయం

ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దాఖలు చేసిన సివిల్ కేసులో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, మాజీ రా చీఫ్ సామంత్ గోయల్‌కు సమన్లు అందజేయాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఢిల్లీ కోర్టుల ద్వారా ఈ ప్రక్రియ చేపట్టాలని సూచించింది. (వివరాలు 3లో..)



ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 24 - మార్చి 20 వరకు పరీక్షలు

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కీలక సమాచారం. 2027 ఫిబ్రవరి-మార్చి నెలల్లో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి గురువారం, నవంబర్ 19న విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఫస్టియర్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 24న, సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభం కానున్నాయి.అన్ని థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. (వివరాలు 3లో..)

BHARAT TODAY — వాస్తవ నైజం — భారత్ టుడే — My Nation- My Respect

శుక్రవారం 20 నవంబర్ 2026

www.barathtoday.net

కుటుంబాలకు భరోసాగా
ఇందిరమ్మ బీమా

సిద్దిపేట అభివృద్ధికి రూ.544 కోట్ల వరాలు

బీమా పథకం ప్రారంభంతో పాటు సిద్దిపేట జిల్లా సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి భారీ స్థాయిలో నిధులు కేటాయిస్తూ పలు పనులకు శ్రీకారం చుట్టారు.

విద్య, రెవెన్యూ, విద్యుత్ రంగాలకు ప్రాధాన్యం

జిల్లాలో మొత్తం రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో రూ.451.13 కోట్లతో చేపట్టనున్న కొత్త పనులకు శంకుస్థాపనలు చేయగా, మరో రూ.92.98 కోట్లతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో పరిపాలనా సేవలు, విద్యుత్ సదుపాయాలను మరింత మెరుగుపర్చేలా ప్రణాళికలు రూపొందించారు.

పూర్తయిన పనులు ప్రజలకు అంకితం

కొమురవెల్లి మల్లన్న ఆలయ సత్రం, క్యూ కాంప్లెక్స్, గ్రామ సంఘాల భవనాలు, కస్తూర్బా పాఠశాల భవనం వంటి పూర్తయిన నిర్మాణాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్య, మౌలిక సదుపాయాలు, పరిపాలన రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాలను చేపట్టింది. ప్రతి కుటుంబానికి భద్రత, ప్రతి జిల్లాకు అభివృద్ధి, ప్రతి పౌరుడికి సంక్షేమం అందించాలన్నదే ప్రజా పాలన ప్రభుత్వ సంకల్పమని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. సిద్దిపేటలో బీమా పథకం ప్రారంభంతో పాటు భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ప్రాధాన్యతను చాటుతోంది.

త్వరలో బీజేపీలోకి హరీశ్‌రావు

- **రేవంత్ సంచలన బాంబు!**
- **దమ్ముంటే కాదని ఒట్టేసి చెప్పు**
- **సిద్దిపేట వేదికగా సీఎం సవాల్**

తెలంగాణ రాజకీయాల్లో సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి రాజకీయ బాంబు పేల్చారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ, ఆయన బీజేపీలోకి వెళ్లే అంశాన్ని ప్రస్తావించినట్లు రాజకీయ చర్చకు తెరలేపారు. సిద్దిపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. పట్టణ అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.550 కోట్లు కేటాయించిందని ప్రకటించారు. అభివృద్ధి కార్యక్రమాల వేదికను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

నాలుగు దశాబ్దాలుగా కుటుంబమేనా?

సిద్దిపేట రాజకీయాలపై రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాలుగు దశాబ్దాలుగా మామ, అల్లుడు, బామ్మర్దులే రాజకీయాలను శాసిస్తున్నారని విమర్శించారు. "వాడు పోతే వీడు.. వీడు పోతే వాడు.. నాలుగు దశాబ్దాలుగా సిద్దిపేటను మీ కుటుంబమే ఏలాలా? సిద్దిపేట ఏమైనా మీ కుటుంబ గడీనా? కుటుంబ రాజ్యమా?" అంటూ నిలదీశారు. రాజకీయంగా ఎదగడానికి సహకరించిన వారినే కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. గతంలో తనకు రాజకీయ జీవితం ఇచ్చిన మదన్‌మోహన్‌పైనే టీడీపీ నుంచి పోటీ చేశారని గుర్తుచేశారు.

వైఎస్సార్ భిక్షతో మంత్రి పదవి!

మాజీ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. 2004లో వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని హరీశ్‌రావుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవకాశం కల్పించారని, ఆ రాజకీయ అవకాశంతోనే మంత్రి పదవి పొందారని వ్యాఖ్యానించారు. మంత్రి అయిన తర్వాత సిద్దిపేటలో కాంగ్రెస్ ఉనికిని దెబ్బతీయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. గతంలో చైతన్య, నారాయణ విద్యాసంస్థలను వ్యతిరేకించిన హరీశ్‌రావు ఇప్పుడు వాటికే పాలు సరఫరా చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. సిద్దిపేటలో కాంగ్రెస్ మళ్లీ బలపడుతోందని, పార్టీ కార్యకర్తలు తమ సత్తా చాటుతున్నారని ధీమా వ్యక్తం చేశారు.



వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?

కేసీఆర్ కుటుంబ ఆస్తులపైనా సీఎం ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేక కుటుంబాలు ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, కేసీఆర్, హరీశ్‌రావు కుటుంబాలు వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించాయని నిలదీశారు. రంగనాయక్‌సాగర్ సమీపంలోని హరీశ్‌రావు ఫామ్‌హౌస్, జన్వాడలో కేటీఆర్ నివాసం, కొండపోచమ్మ సమీపంలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. ఉద్యమకారుడు శ్రీకాంతాచారి ప్రాణత్యాగం చేసినా, ఆయన తల్లికి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆరోపించారు. కానీ కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం రాజకీయ పదవులు దక్కాయని విమర్శించారు.

ప్రాజెక్టుల అవినీతే పదవికి అడ్డంకా?

హరీశ్‌రావుకు రెండోసారి మంత్రి పదవి దక్కకపోవడానికి ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతి కూడా కారణమని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు గత ప్రభుత్వ నిర్ణయాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నేతలపై విమర్శలు సంధించారు. ఒకవైపు కుటుంబ పాలన, మరోవైపు ఆస్తుల వ్యవహారం, ఇంకోవైపు ప్రాజెక్టుల ఆరోపణలతో సిద్దిపేట సభను రాజకీయంగా వేడెక్కించారు. ముఖ్యంగా హరీశ్‌రావు బీజేపీలోకి వెళ్తారన్న అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు, బీఆర్ఎస్ అధిష్ఠానం ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

కోమటిరెడ్డికి పరోక్షంగా చురకలు!

మంచి చెవిలో.. చెడు మైక్‌లోనా?

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభలో పరోక్షంగా ఘాటైన స్పందన ఇచ్చారు. పార్టీలోని కొందరు నాయకులు బహిరంగంగా మాట్లాడుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెడు విషయాలను చెవిలో చెప్పాలని, మంచి విషయాలను మైక్‌లో అందరికీ వినిపించాలని వ్యాఖ్యానించారు. అయితే కొందరు నాయకులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మంచి విషయాలను తన ఇంటికి వచ్చి చెవిలో చెబుతున్నారని, చెడు విషయాలను మాత్రం బహిరంగంగా మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజగోపాల్‌రెడ్డి చేసిన విమర్శలకు సమాధానంగా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

పార్టీలో క్రమశిక్షణపై పరోక్ష హెచ్చరిక

పార్టీ నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంలో బాధ్యతగా వ్యవహరించాలని రేవంత్ వ్యాఖ్యల సారాంశంగా కనిపించింది. ప్రభుత్వ పనితీరుపై సూచనలు, విమర్శలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని బహిరంగ వివాదాలుగా మార్చడం సరికాదనే సంకేతాన్ని ఇచ్చారు. కొందరు నాయకుల తీరును పిచ్చికుక్క కరిచినట్లుగా ఉందంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారు. బీఆర్ఎస్‌పై విమర్శలతో పాటు సొంత పార్టీలోని నేతల తీరుపైనా సీఎం అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో మంచి విషయాలకు ప్రోత్సాహం, సమస్యలకు అంతర్గత పరిష్కారం ఉండాలన్న సందేశాన్ని రేవంత్ తన వ్యాఖ్యల ద్వారా ఇచ్చారు.

సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా

2029లో మళ్లీ గెలుపు హస్తానిదే..!

సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ రాజకీయ పునరుజ్జీవనం మొదలైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోనే కాకుండా సిద్దిపేట గడ్డపైనా కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సిద్దిపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో కాంగ్రెస్ బలాన్ని కార్యకర్తలు నిరూపించారని అన్నారు. ప్రజలు కోరుకున్న నాయకుడికే పార్టీ టికెట్ ఇస్తామని, ఆ అభ్యర్థిని గెలిపించే బాధ్యత స్థానిక ప్రజలదేనని చెప్పారు. సిద్దిపేటలో కాంగ్రెస్ విజయం సాధిస్తే నియోజకవర్గానికి మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. 2029లో మరోసారి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని ప్రకటించారు.

- **రూ.550 కోట్లతో అభివృద్ధికి భరోసా**

సిద్దిపేట అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.550 కోట్లతో పనులు చేపడుతోందని రేవంత్ తెలిపారు. ఇందులో రూ.544.11 కోట్ల పనులను ప్రారంభించగా, రూ.451.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసినట్లు ప్రకటించారు. ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు దుబ్బాక, సిద్దిపేటలో రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా పాఠశాలలకు శంకుస్థాపన చేశారు. ఆరు తహసీల్దార్ కార్యాలయాలు, 14 విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టారు. తొలి దశ తెలంగాణ ఉద్యమ నేత అనంతుల మదన్‌మోహన్ పేరును సిద్దిపేట మెడికల్ కాలేజీకి పెడతామని ప్రకటించారు. ఆయన పేరును మరుగునపరచేందుకు గత పాలకులు ప్రయత్నించారని ఆరోపించారు. అభివృద్ధి పనులతో పాటు రాజకీయంగా కూడా సిద్దిపేటలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

నీళ్ల పంచాయితీపై కేటీఆర్‌కు కౌంటర్!

కృష్ణా జలాలపై పాత నిర్ణయాల ప్రశ్న

తెలంగాణకు సాగునీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందంటూ వస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట సభలో సమాధానమిచ్చారు. తాను తెలంగాణ బిడ్డనని, ఈ నేలపై పుట్టి ఇక్కడే పెరిగానని, రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎప్పుడూ వ్యవహరించబోనని స్పష్టం చేశారు. నీటి విషయంలో తనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని గతంలో అంగీకరించింది కేసీఆర్, హరీశ్‌రావులేనని ఆరోపించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రగతిభవన్‌కు ఆహ్వానించి రాయలసీమ ప్రాజెక్టుకు సహకరించింది కూడా గత ప్రభుత్వమేనని విమర్శించారు.

గత పాలనపై నిలదీత.. అసెంబ్లీకి రావాలంటూ సవాల్

రాయలసీమ ప్రాజెక్టు విషయంలో కమీషన్ల కోసం సహకరించారా అని రేవంత్ ప్రశ్నించారు. అప్పట్లో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలను ఇప్పుడు ఎందుకు సమర్థించుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకత్వాన్ని నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో హరీశ్‌రావు కీలకంగా వ్యవహరించారని, మూడేళ్లకే ప్రాజెక్టులో సమస్యలు తలెత్తాయని విమర్శించారు. గత నిర్ణయాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు నీళ్ల విషయంలో ఎవరు ఏం చేశారో అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధమని రేవంత్ ప్రకటించారు. కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలపై చేసిన ఈ విమర్శలు నీటి రాజకీయాలను మరోసారి తెరపైకి తెచ్చాయి.

క్రమశిక్షణపై అందరికీ ఒకే నిబంధన

- **వ్యాఖ్యలను పరిశీలిస్తున్న అధిష్ఠానం**
- **రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై న జర్!**

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యల వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్పందించారు. రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్ చేసిన వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం గమనిస్తోందని, ఈ అంశాలపై సమగ్రంగా పరిశీలన జరుగుతోందని తెలిపారు. పార్టీలో క్రమశిక్షణ విషయంలో ఎవరికి మినహాయింపులు ఉండవని, అందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్య పార్టీ అని పేర్కొన్న ఆయన, ప్రతి అంశానికి తగిన సమయం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై పార్టీ నాయకత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని సంకేతాలిచ్చారు.

సందీప్ బాధ్యతల తర్వాత నిర్ణయం

గతంలో కొండా సురేఖ విషయంలో చర్యలు తీసుకునే ముందు పలుమార్లు అవకాశం ఇచ్చామని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. కొత్త పార్టీ ఇన్‌ఛార్జి సందీప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీకి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తారని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితులు, పార్టీ అంతర్గత పరిశీలన ఆధారంగానే తదుపరి నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు. రాజగోపాల్‌రెడ్డి వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే తన దృష్టికి తీసుకుందని తెలిపారు. దీంతో ఈ వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న అంశం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



హుస్నాబాద్ విలీనంపై
పొన్నం పట్టుదల!

- **కరీంనగర్‌లో కలపాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి**
- **జిల్లాల విభజనతో స్థానికంగా అసంతృప్తి**

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ సమయంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని మండలాలను సిద్దిపేట, హనుమకొండ, కరీంనగర్ జిల్లాల్లో విభజించారు. ఈ నిర్ణయంపై అప్పట్లో స్థానిక ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల్లో ఉండటంతో పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. దీంతో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

ఎన్నికల హామీని మరోసారి గుర్తుచేసిన మంత్రి

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ మండలాలను తిరిగి కరీంనగర్ జిల్లాలో కలిపిస్తానని హామీ ఇచ్చారు. తాజాగా సిద్దిపేట పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలను కరీంనగర్ జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలుపై స్థానికుల్లో ఆశలు నెలకొన్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదనపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.



కాంగ్రెస్ నేతలే
అవినీతి బయటపెడుతున్నారు!

రైతుల కన్నీళ్లు కనిపించవా.. సీఎంపై కేటీఆర్ ఫైర్

రాష్ట్రంలో నీటి దోపిడీ జరుగుతుంటే నిద్రపోతున్నారని, వాస్తవాలను ప్రశ్నించే వారిపైనే నిందలు వేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అమరవీరుల గురించి మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనలేని వ్యక్తి ఉద్యమ వారసత్వంపై మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. సిరిసిల్లలో మొదలైన విమర్శల పరంపర సిద్దిపేటలోనూ కొనసాగిందని, ముఖ్యమంత్రి తన పదవికి తగిన హుందాతనంతో వ్యవహరించాలని హితవు పలికారు.



ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెబుతారు

కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కనపెట్టి అవినీతికి ప్రాధాన్యం ఇస్తోందని కేటీఆర్ ఆరోపించారు. అబద్ధాలు, ఆరోపణలతో ఇంకెంతకాలం పాలన సాగిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి కాలం దగ్గరపడిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి నియోజకవర్గం సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గర్జిస్తుందని అన్నారు. ఢిల్లీ నాయకత్వానికి విధేయులుగా ఉంటూ ఉద్యమ నేత కేసీఆర్‌ను విమర్శించడం తప్ప కాంగ్రెస్ నాయకులకు ప్రజలకు చెప్పడానికి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను కల్పవృక్షంగా అభివర్ణించిన కేటీఆర్.. మేనిఫెస్టోలో లేని ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా రాజకీయ విమర్శలతో కాలం గడిపితే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

కమిషన్ల ఆరోపణలతో కాంగ్రెస్‌పై దాడి

కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి గురించి బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, ఆ పార్టీ నేతలే ఒక్కొక్కరుగా వాస్తవాలను బయటపెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 నుంచి 20 శాతం కమీషన్ ఇవ్వనిదే పనులు జరగడం లేదని ఆ ఎమ్మెల్యే బహిరంగంగా చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. అధికారులు కమీషన్లు తీసుకుంటున్నారని చెబుతూనే, ఎమ్మెల్యేలు మాత్రం తమకు సంబంధం లేదన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ వ్యాఖ్యలే కాంగ్రెస్ పాలనలో అవినీతి పరిస్థితిని బయటపెడుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. టెండర్లలో అవినీతి జరుగుతోందని రాజగోపాల్‌రెడ్డి ఆరోపించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కేసీఆర్ పథకాలు ఎక్కడ?

- **ప్రగల్భాలు తప్ప ప్రజా ఎజెండా ఏది?**
- **సీఎం రేవంత్ ప్రసంగంపై హరీశ్ ఫైర్**

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గతంలో చేసిన ప్రకటనలకు సంబంధించి ప్రజలకు స్పష్టత ఇవ్వలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రజలకు ఉపయోగపడే అంశాలను ప్రస్తావించకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. మాటల్లో బరువు, చేతల్లో అభివృద్ధి చూపించాలని హితవు పలికారు.



తాడిచెట్టుపై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి

రేవంత్‌రెడ్డి తాడిచెట్టు, గడ్డం వంటి అంశాలను ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు గౌడ సామాజిక వర్గాన్ని అవమానించేలా ఉన్నాయని హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాడిచెట్టు గౌడన్నలకు జీవనాధారమని, ఎన్నో కుటుంబాలకు కల్పతరువుగా నిలుస్తోందని గుర్తుచేశారు. ప్రకృతి విపత్తులను తట్టుకుని నిలబడే తాడిచెట్టును పదేపదే తక్కువ చేసి మాట్లాడటం తగదన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని గౌడ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని, నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. ప్రజా సమస్యలకు సమాధానాలు ఇవ్వాల్సిన సమయంలో వ్యక్తిగత విమర్శలతో కాలక్షేపం చేయడం పాలకులకు తగదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

కేసీఆర్ పథకాలన్నీ ఎక్కడ?

కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్యలక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్, దళితబంధు, రైతుబీమా, గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు, మన ఊరు-మన బడి, కంటి వెలుగు వంటి పథకాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ పథకాల పరిస్థితిపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాము నిర్మించిన ప్రాజెక్టులు, ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు పేర్లు పెట్టడం తప్ప కొత్తగా చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. వంట పూర్తయ్యాక గరిటె తిప్పి ఘనత తనదేనని చెప్పుకునే ధోరణిలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కేసీఆర్‌పై విమర్శలు చేసే అర్హత ఎక్కడిది?

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని హరీశ్‌రావు అన్నారు. శంకరమ్మకు కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి పోటీ చేయిస్తే, ఆమెను ఓడించింది ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా గతాన్ని మరిచిపోతున్నారని విమర్శించారు. దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ముత్యంరెడ్డి క్యాన్సర్‌తో బాధపడినప్పుడు కేసీఆర్ అమెరికాకు పంపించి వైద్యం చేయించారని గుర్తుచేశారు. అలాంటి మానవతావాదిపై నోరు పారేసుకోవడం సూర్యుడిపై ఉమ్మివేయడమేనని వ్యాఖ్యానించారు. సిద్దిపేటకు వచ్చి విమర్శలు చేయడం కాకుండా, నియోజకవర్గానికి ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలుపై సమాధానం చెప్పిన తర్వాతే గత పాలనపై మాట్లాడాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రేవంత్ సర్కారుపై రాజాసింగ్ ఫైర్!

- **రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలకు మద్దతు**
- **నిధుల కేటాయింపులో వివక్షపై విమర్శలు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన విమర్శలకు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మద్దతు పలికారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల విడుదలలో వివక్ష చూపుతున్నారన్న ఆరోపణల్లో తప్పేమీ లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంతో పాటు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలకే నిధులు విడుదల చేస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి గతంలో విమర్శించారు. మునుగోడు నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగితే పోరాటం చేస్తానని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలకు మద్దతుగా రాజాసింగ్ సోషల్ మీడియాలో విడుదలైన వీడియోలో ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు నిధుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతూ వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

బీఆర్ఎస్ పాలనతో పోల్చిన రాజాసింగ్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో ఇలాంటి సమస్యలు ఉండేవి కావని, ఎమ్మెల్యేలకు అధికారులతో సమాచార లోపం ఎదురయ్యేది కాదని రాజాసింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారులు ఎమ్మెల్యేల మాట వినడం లేదని, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎండీతో పాటు మున్సిపల్ కమిషనర్ కూడా ఫోన్ కాల్స్‌కు స్పందించడం లేదని ఆరోపించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి దగ్గరగా ఉన్న ఎమ్మెల్యేల నియోజకవర్గాలకే నిధులు వెళ్తున్నాయని, మిగతా ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్‌తో తనకు రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, గతంలో నిధుల కేటాయింపులో వివక్ష చూపలేదని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మ

వాస్తవ నైజం
భారత్ టుడే
BHARAT TODAY
My Nation- My Respect
శుక్రవారం 20 నవంబర్ 2026
www.barathtoday.net

ఎన్నికల బహిష్కరణ ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- ప్రజాస్వామ్యంపై విశ్వాసంతోనే పోరాటం: రాహుల్

భారత ప్రజాస్వామ్యం పవిత్రమైనదని, ఎన్నికలను బహిష్కరిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థే బలహీనపడుతుందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా నవంబర్ 18న చికాగో విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రొఫెసర్ రాబర్ట్ పేప్ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నప్పటికీ, ఎన్నికలను బహిష్కరించకూడదని కాంగ్రెస్ నిర్ణయించిందని రాహుల్ వివరించారు. ఎన్నికల్లో పోటీ చేయవద్దని పార్టీ కార్యకర్తలకు చెబితే ప్రజాస్వామ్య ప్రక్రియకే నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవస్థలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు వివరించడం, ప్రజల్లో అవగాహన పెరిగే వరకు పోరాటం కొనసాగించడమే తమ వ్యూహమని చెప్పారు.

ఎన్నికల సంఘంపై సంచలన వ్యాఖ్యలు

ఎన్నికల ప్రక్రియలో అక్రమాలపై గతంలో అనుమానాలు ఉన్నప్పటికీ ఆధారాలు లేకపోవడంతో మాట్లాడలేకపోయామని రాహుల్ అన్నారు. 2014 ఎన్నికల్లో గెలుపు ఓటముల మధ్య తేడాలు అసాధారణంగా ఉన్నాయని అప్పుడే అనుమానించామని వెల్లడించారు. తర్వాత ఆధారాలు లభించినప్పుడు కాంగ్రెస్ నాయకులకు వివరించినా, వాటిని బహిరంగంగా ప్రస్తావించవద్దని కొందరు సూచించారని చెప్పారు. ప్రజాస్వామ్యంపై తమకు ఉన్న గౌరవం వల్ల బలమైన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం నుంచి అంతర్గత సమాచారం కూడా తమకు అందుతోందని, ఆ సంస్థలోని సీనియర్ అధికారులు సైతం కొన్ని అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు.

విదేశాంగ విధానంపై రాహుల్ అభిప్రాయం

ఇరాన్ యుద్ధ పరిణామాలపై స్పందిస్తూ అంతర్జాతీయ చర్చల్లో భారత్ క్రియాశీల పాత్ర పోషించాలని రాహుల్ అన్నారు. ఇరాన్, అమెరికా మధ్య చర్చల్లో పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహిస్తుండగా భారత్ ప్రేక్షక పాత్రలో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌గాజా ఘర్షణపైనా ఆయన స్పందించారు. భారత విదేశాంగ విధానం ఇతర దేశాల ప్రయోజనాల కంటే మన జాతీయ ప్రయోజనాల ఆధారంగా ఉండాలని చెప్పారు. అక్టోబర్ 7న జరిగిన దాడులను ఖండిస్తున్నానని, అమాయకుల హత్యలు తప్పని పేర్కొంటూనే గాజాలో ఇజ్రాయెల్ చర్యలను కూడా ఖండిస్తున్నానన్నారు.



రాహుల్ వ్యాఖ్యలపై రిజిజు అభ్యంతరం

రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. దేశంలో ప్రజాస్వామ్య స్వేచ్ఛలు లేకపోతే ప్రతిపక్షాలు ఎలా నిరసనలు తెలుపుతున్నాయని, ప్రభుత్వాన్ని ఎలా విమర్శిస్తున్నాయని ప్రశ్నించారు. విదేశీ పర్యటనల్లో భారత్‌పై మాట్లాడేటప్పుడు లోక్‌సభ ప్రతిపక్ష నేత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. దేశం గురించి విదేశాల్లో తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు, ఎన్నికల వ్యవస్థపై ఆయన ఆరోపణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

పరిశ్రమలపై మోదీ అసంతృప్తి

- ఉత్పత్తి నుంచి ఉపాధి వరకు ప్రశ్నలు

దేశీయ పరిశ్రమల పనితీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తయారీ రంగంలో స్వయం సమృద్ధి, ఉద్యోగాల కల్పన, వేతనాల పెంపు, ఉత్పత్తుల నాణ్యత, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వినియోగంలో పరిశ్రమలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని విమర్శించారు. నవంబర్ 19న ఢిల్లీలో ఫిక్కీ శతాబ్ది వార్షిక సమావేశ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన పారిశ్రామిక వేత్తలకు పలు అంశాలపై ప్రశ్నలు సంధించారు. మరోవైపు భారత్ ఆర్థికంగా సాధించిన పురోగతిని ప్రస్తావించారు. ఒకప్పుడు 'ఫ్రజైల్ ఫైవ్'లో ఉన్న దేశం నేడు వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని చెప్పారు. తలసరి ఆదాయం పెరిగిందని, పేదరికం తగ్గింపు ప్రయత్నాలను ప్రపంచ బ్యాంకు గుర్తించిందని వివరించారు.

గాంధీ కలల స్వదేశీ ఎక్కడ?

దేశంలో తయారీని పెంచి, విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలన్న లక్ష్యం ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదని మోదీ వ్యాఖ్యానించారు. 1930లో మహాత్మా గాంధీ పరిశ్రమల వర్గాలకు స్వదేశీ, స్వయం



సమృద్ధి గురించి చెప్పిన విషయాలనే ఇప్పుడు తాను మళ్లీ గుర్తుచేయాల్సి వస్తోందని అన్నారు. ఫిక్కీ వందేళ్లు పూర్తి చేసుకున్నా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని ప్రశ్నించారు. 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాన్ని సాధించడంలో పరిశ్రమలు మరింత చొరవ చూపాలని సూచించారు.

పన్ను ప్రయోజనాలు ఉద్యోగులకు అందాయా?

కార్పొరేట్ పన్నును 22 శాతానికి తగ్గించామని, ఏడాదికి రూ.12 లక్షల వరకు ఆదాయం పొందేవారికి ఆదాయపు పన్ను భారం లేకుండా చర్యలు తీసుకున్నామని ప్రధాని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం కల్పించిన ప్రయోజనాలు ఉద్యోగులకు వేతనాల పెంపు రూపంలో అందుతున్నాయా అని పరిశ్రమల అధినేతలను నిలదీశారు. ఉద్యోగుల సంఖ్య పెంచారా, జీతాలు పెంచారా అని ప్రశ్నిస్తూ, ప్రభుత్వం మాత్రమే బాధ్యత తీసుకోవాలనే ధోరణి సరికాదని స్పష్టం చేశారు. దేశీయ వినియోగదారులకు కూడా ఎగుమతి స్థాయి నాణ్యత కలిగిన ఉత్పత్తులు అందించాలని సూచించారు. 140 కోట్ల మంది ప్రజలను హామీతో కూడిన మార్కెట్‌గా భావించి నాణ్యతలో రాజీ పడకూడదన్నారు.

వాణిజ్య ఒప్పందాలను అందిపుచ్చుకోవాలి

వివిధ దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు పరిశ్రమలకు చారిత్రక అవకాశమని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో ఒప్పందాలు కుదురుతున్నా, వాటి ద్వారా లభించే ప్రయోజనాలను పొందేందుకు పరిశ్రమలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయా అని ప్రశ్నించారు. ఫిక్కీ వంటి పారిశ్రామిక సంస్థలు ఈ అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం అవకాశాల ద్వారాలు తెరుస్తోంది.. వాటిని ఉపయోగించుకుని ప్రపంచ మార్కెట్‌లో పోటీపడాల్సిన బాధ్యత పరిశ్రమలదే అని ప్రధాని తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

- ఫిబ్రవరి 24 - మార్చి 20 వరకు పరీక్షలు

తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కీలక సమాచారం. 2027 ఫిబ్రవరి-మార్చి నెలల్లో నిర్వహించనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి గురువారం, నవంబర్ 19న విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఫస్టియర్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 24న, సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభం కానున్నాయి. అన్ని థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఫస్టియర్ పరీక్షలు సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1తో ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 26న ఇంగ్లిష్ పేపర్-1 పరీక్ష ఉంటుంది. సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25న సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2తో మొదలై, ఫిబ్రవరి 27న ఇంగ్లిష్ పేపర్-2 నిర్వహిస్తారు. మార్చి 20న థియరీ పరీక్షలు ముగుస్తాయి.

ప్రాక్టికల్స్‌కు ప్రత్యేక షెడ్యూల్

సెకండియర్ సైన్స్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఆదివారాలు కూడా పరీక్షలు ఉంటాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయి. ఫస్టియర్ సైన్స్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు మూడు విడతల్లో నిర్వహిస్తారు. ఉదయం 9-11, మధ్యాహ్నం 12-2, సాయంత్రం 3.30-5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఫస్టియర్‌కు జనవరి 29న, సెకండియర్‌కు జనవరి 30న జరుగుతాయి.



జనవరిలోనే తప్పనిసరి పరీక్షలు

పర్యావరణ విద్య పరీక్ష జనవరి 27న, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జనవరి 29న నిర్వహిస్తారు. ఫస్టియర్ విద్యార్థులకు జనవరి 20 నుంచి 25 వరకు ఇంటర్నల్ అసెస్‌మెంట్ ఉంటుంది. ఈ షెడ్యూల్ ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు కూడా వర్తిస్తుందని బోర్డు వెల్లడించింది. అయితే వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన ప్రత్యేక టైమ్‌టేబుల్‌ను విడిగా విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. విద్యార్థులు పరీక్షల తేదీలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించేలా ఈ షెడ్యూల్ విడుదలైంది.

దోవల్‌కు అమెరికా
కోర్టు సమన్లు

- ఢిల్లీ కోర్టుల ద్వారా జారీకి ఆదేశాలు
- సమన్ల జారీకి ప్రత్యామ్నాయ మార్గం
- హేగ్ ఒప్పందం ఆధారంగా నిర్ణయం

ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దాఖలు చేసిన సివిల్ కేసులో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, మాజీ రా చీఫ్ సామంత్ గోయల్‌కు సమన్లు అందజేయాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఢిల్లీ కోర్టుల ద్వారా ఈ ప్రక్రియ చేపట్టాలని సూచించింది. నవంబర్ 13న ఇచ్చిన ఉత్తర్వుల్లో న్యూయార్క్ దక్షిణ జిల్లా కోర్టు న్యాయమూర్తి కేథరిన్ పోల్క్ ఫైల్లా ఈ ఆదేశాలు జారీ చేశారు. దోవల్‌కు పటియాలా హౌస్ జిల్లా కోర్టు ద్వారా, గోయల్‌కు ద్వారకా, తీస్ హజారీ జిల్లా కోర్టుల ద్వారా న్యాయపత్రాలు అందించాలని పేర్కొన్నారు. హేగ్ కన్వెన్షన్‌తో పాటు భారత పౌర ప్రక్రియాస్మృతి (సీపీసీ)లోని నిబంధనలను ప్రస్తావిస్తూ విదేశీ సివిల్ కోర్టులు భారత న్యాయస్థానాల సహకారంతో సమన్లు అందజేయవచ్చని న్యాయమూర్తి పేర్కొన్నారు. విదేశీ కోర్టుల సమన్లను భారత కోర్టులకు పంపి, దేశీయ సమన్ల మాదిరిగానే అందజేసేందుకు సీపీసీ అవకాశం కల్పిస్తుందని వివరించారు. అయితే హేగ్ కన్వెన్షన్ ప్రకారం భారత కేంద్ర అధికార సంస్థ ద్వారా సమన్లు పంపే సాధారణ విధానం విఫలమైందని అమెరికా కోర్టు తెలిపింది. దీంతో కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 19 ప్రకారం ప్రత్యామ్నాయ పద్ధతికి అనుమతించింది.

కేంద్రం అభ్యంతరం.. వేర్వేరు కేసులు

అమెరికాలో న్యాయవాదిగా ఉన్న పన్నూన్ నిషేధిత



సంస్థ సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే)కు సంబంధించిన వ్యక్తి. తన హత్యకు కుట్ర జరిగిందంటూ నష్ట పరిహారం కోరుతూ సివిల్ దావా వేశారు. ఈ కుట్ర వెనుక దోవల్ ఉన్నారని, భారత విదేశీ నిఘా సంస్థ రా ప్రమేయం ఉందని ఆరోపించారు. గత నెలలో అమెరికా విదేశాంగ శాఖ దౌత్య నోట్ ద్వారా భారత రాయబార కార్యాలయానికి సమన్లు పంపే ప్రయత్నం చేసింది. అయితే భారత్ ఈ కేసును తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరోపణలు కల్పితమైనవి, దురుద్దేశపూరితమైనవని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ నవంబర్ 10న స్పష్టం చేశారు. భారత్‌లో న్యాయపత్రాల జారీ ప్రక్రియను కేంద్ర న్యాయశాఖ ద్వారా మాత్రమే చేపట్టాలని భారత ప్రభుత్వం పేర్కొంది. అమెరికా ప్రభుత్వం ఈ సివిల్ కేసులో భాగస్వామి కాదని స్పష్టం చేసింది. ఇదే వ్యవహారానికి సంబంధించి నిఖిల్ గుప్తా, మాజీ రా అధికారి వికాస్ యాదవ్‌పై అమెరికాలో కొనసాగుతున్న హత్యకు కుట్ర క్రిమినల్ విచారణ వేరు. పన్నూన్ దావాతో దానిని కలిపి చూడకూడదు. తాజా ఉత్తర్వులు సమన్లను అందజేసే విధానానికి సంబంధించినవే.

స్టాలిన్‌ను ఓడించిన
ఎమ్మెల్యే కన్నుమూత

- గుండెపోటుతో వీఎస్ బాబు మృతి

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కొలత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఓడించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎమ్మెల్యే వీఎస్ బాబు గురువారం (నవంబర్ 19) కన్నుమూశారు. ఆయన వయసు 75 సంవత్సరాలు. కొంతకాలంగా శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న బాబు సెప్టెంబర్ 9న చెన్నైలోని అమింజికరై ప్రాంతంలో ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలో చేరారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. గురువారం గుండెపోటు రావడంతో మధ్యాహ్నం 2.24 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో తమిళనాడు అసెంబ్లీలో ఖాళీ స్థానాల సంఖ్య ఆరుకు చేరింది.

డీఎంకే నుంచి టీవీకే వరకు ప్రస్థానం

వీఎస్ బాబు రాజకీయ జీవితం డీఎంకేతో ప్రారంభమైంది. పార్టీ ఏరియా కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఉత్తర చెన్నై జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగారు. 2006 అసెంబ్లీ ఎన్నికల్లో పురసైవాక్కం నియోజకవర్గం నుంచి డీఎంకే అభ్యర్థిగా తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2008 నియోజకవర్గాల పునర్విభజనలో పురసైవాక్కం రద్దవడంతో ఆ ప్రాంతంలోని పలు ప్రాంతాలు కొత్తగా ఏర్పడిన కొలత్తూరులో కలిశాయి. 2011 ఎన్నికల్లో కొలత్తూరు నుంచి స్టాలిన్ విజయంలో బాబు కీలక పాత్ర పోషించినట్లు అప్పట్లో గుర్తింపు పొందారు. ఆ తర్వాత కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన 2016లో అన్నాడీఎంకేలో చేరారు. ఈ ఏడాది టీవీకేలో చేరి కొలత్తూరు





నుంచి పోటీ చేసి స్టాలిన్‌పై విజయం సాధించారు. ఒకప్పుడు స్టాలిన్ విజయానికి తోడ్పడిన నాయకుడే.. చివరకు ఆయనను ఓడించి వార్తల్లో నిలిచారు.

పార్టీలకు అతీతంగా నేతల నివాళులు

బాబు మృతిపై తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సంతాపం తెలిపారు. ప్రజా జీవితంలో ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. టీవీకే అధినేత, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ బాబు మరణం తీరని లోటని పేర్కొన్నారు. ప్రజల ప్రేమాభిమానాలు, విశ్వాసాన్ని పొందిన నాయకుడిగా ఆయనను గుర్తుచేసుకున్నారు. డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబానికి సానుభూతి తెలిపారు. తమిళనాడు మంత్రులు, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్, వీసీకే నేత తొల్ తిరుమావళవన్, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ సహా పలు పార్టీల నాయకులు బాబు మృతికి సంతాపం ప్రకటించారు.

రాజీనామాతో తొలగింపు
ప్రక్రియకు ముగింపు

చర్యలు చెల్లవంటూ లోక్‌సభ కార్యదర్శికి లేఖ

రాజీనామాతో ప్రక్రియ నిరర్థకమైంది: జస్టిస్ వర్మ

న్యాయమూర్తి పదవికి తాను రాజీనామా చేసిన నేపథ్యంలో తనను తొలగించేందుకు చేపట్టిన ప్రక్రియకు ఇక రాజ్యాంగపరమైన ప్రాతిపదిక లేదని జస్టిస్ యశ్వంత్ వర్మ స్పష్టం చేశారు. రాజీనామా అనంతరం తొలగింపు ప్రక్రియ కొనసాగించడం నిరర్థకమని పేర్కొన్నారు. ఈ మేరకు సెప్టెంబర్ 10న లోక్‌సభ కార్యదర్శి జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు లేఖ రాశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన విచారణ కమిటీ నివేదికపై తన అభిప్రాయాలను అందులో వివరించారు. ఈ లేఖను నవంబర్ 19న పార్లమెంట్ సభ్యులకు పంపిణీ చేశారు.

ఆరోపణలను ఖండించిన న్యాయమూర్తి

తనపై వచ్చిన ఆరోపణలను జస్టిస్ వర్మ మరోసారి ఖండించారు. తన వద్ద అక్రమంగా సంపాదించిన నగదు ఉందన్న ఆరోపణతో పాటు, ఇతర అభియోగాల్లోనూ తాను నిర్దోషినని పేర్కొన్నారు. రాజీనామానేర అంగీకారంగా లేదా ఆరోపణల అంగీకారంగా భావించరాదని స్పష్టం చేశారు. అయితే, ఆగస్టు 12న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ముగ్గురు సభ్యుల విచారణ



కమిటీ నివేదిక ఆయనకు వ్యతిరేకంగా ఉంది. అధికారిక నివాసంలో నగదు లభించడంపై వివరణ ఇవ్వకపోవడం, నగదుకు సంబంధించిన ఆధారాలను భద్రపరచడంలో విఫలమవడం, విచారణలో అసంతృప్తికర సమాధానాలు ఇవ్వడం వంటి మూడు అభియోగాలూ నిరూపితమైనట్లు కమిటీ తేల్చింది.

రోడ్డు ప్రమాదాలపై మంత్రి ఆవేదన

- ఘటనలు కన్నీరు పెట్టిస్తున్నాయ్
- ఏటా 1.80 లక్షల మరణాలు
- ఇంజినీర్లకు నితిన్ గడ్కరీ సూచనలు

దేశంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టం తనను తీవ్రంగా కలచివేస్తున్నాయని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయిలో భారత రహదారి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందినప్పటికీ, ఏటా ఐదు లక్షల ప్రమాదాలు, 1.80 లక్షల మరణాలు నమోదవుతుండటం బాధాకరమన్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సును ప్రారంభించిన ఆయన, ప్రమాదాల నివారణకు ఇంజినీర్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు. రహదారుల నిర్మాణానికి సిద్ధం చేసే డీపీఆర్‌లు లోపరహితంగా ఉండాలని స్పష్టం చేశారు.

బ్లాక్‌స్పాట్ల తొలగింపే లక్ష్యం

ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, నగర రోడ్లపై పూర్తిగా తొలగించాలని గడ్కరీ సూచించారు. అవసరమైన చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించకుండా వదిలేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ ధరకు కోట్ చేసిన వారికే డీపీఆర్ పనులు అప్పగించే విధానానికి స్వస్తి పలికామని తెలిపారు. రహదారుల రూపకల్పనలో భవిష్యత్ సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంతో కాలుష్యం తగ్గించడంతో పాటు దిగుమతుల



భారం తగ్గించవచ్చన్నారు. పట్టణ వ్యర్థాలను వినియోగంలోకి తెస్తే రూ.5 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా మార్చవచ్చని వివరించారు.

తెలంగాణ అభివృద్ధిపై సీఎం ఆశలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్-2026 ద్వారా భారీ పెట్టుబడులు ఆకర్షిస్తామని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమున్నారు. రాష్ట్రంలో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా సాగుతోందని వివరించారు. తెలంగాణను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు వ్యర్థాల వినియోగంలో కేంద్రం సహకరించాలని గడ్కరీని కోరారు.



రూ.9 కోట్ల మందు.. రూ.2.5 లక్షలకే!

ఏడుగురు చిన్నారులకు ఉచితంగా చికిత్స

పేద కుటుంబాలకు అరుదైన వైద్యం చేరువ

ఒక చిన్నారి ప్రాణాలను కాపాడే మందు అందుబాటులో ఉన్నా.. దాని ధర వింటేనే తల్లిదండ్రులు వెనకడుగు వేయాల్సిన పరిస్థితి. ఏడాదికి రూ.9 కోట్ల వరకు ఖర్చయ్యే అరుదైన వ్యాధి ఔషధాన్ని హైదరాబాద్‌కు చెందిన శిశువైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ చొరవతో కేవలం రూ.2.5 లక్షలకే అందుబాటులోకి తీసుకొచ్చారు. అలన్-హెర్‌డండన్-డడ్లీ సిండ్రోమ్ (ఏహెచ్‌డీఎస్)తో బాధపడుతున్న ఏడుగురు చిన్నారులకు నవంబర్ 30న ఏడాది చికిత్సకు సరిపడా టిరాట్రికాల్ మందును ఉచితంగా అందించనున్నారు. నెదర్లాండ్స్‌లోని ట్రాన్స్‌వాల్ ఫార్మసీ ప్రత్యేకంగా రూపొందించిన ఈ ఔషధానికి యూరప్‌కు చెందిన ఫార్మాస్యూటికల్ అకౌంటబిలిటీ ఫౌండేషన్ సహకరించింది.

ఒక చిన్నారి కోసం మొదలైన పోరాటం

డాక్టర్ శివరంజని సంరక్షణలో ఉన్న అరవ్‌కు ఈ వ్యాధి నిర్ధారణ కావడంతో మందు కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. జర్మనీ నుంచి నెలరోజుల మందు తెప్పించేందుకు అతడి తల్లి పవిత్ర సిరోల్కర్ రూ.12-13 లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఔషధ సంస్థ ద్వారా మందు పొందే ప్రయత్నాలు ఫలించకపోవడంతో శివరంజని సెప్టెంబర్ 7న సామాజిక మాధ్యమాల్లో సహాయం కోరారు. ఆ విజ్ఞప్తితో నెదర్లాండ్స్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. మొత్తం ఏడుగురు చిన్నారుల ఏడాది చికిత్సకు సుమారు రూ.15.08 లక్షలు ఖర్చవుతుండగా, భారత్‌లో శివరంజని రూ.6.09 లక్షలు సమీకరించారు. మిగిలిన మొత్తాన్ని ఫౌండేషన్ సమకూర్చనుంది. భవిష్యత్తులో ఈ మందును భారత్‌లోనే తయారు చేయించి మరింతమంది చిన్నారులకు అందుబాటులోకి తేవాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు.

బిర్యానీ బాంబు

అంబర్‌పేటలో కలకలం..

- మండి బిర్యానీతో మొదలైన ముప్పు
- ఒకే కుటుంబంలో 9 మందికి అస్వస్థత!
- ఐదుగురు చిన్నారులకూ వాంతులు, విరేచనాలు

హోటల్‌లో బిర్యానీ తింటే ఆకలి తీరుతుందని వెళ్లిన కుటుంబానికి ఆస్పత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి ఎదురైంది. హైదరాబాద్ అంబర్‌పేటలోని గాంధీ బొమ్మ సమీపంలో ఉన్న ముక్కరమ్ హోటల్ నుంచి మండి బిర్యానీ కొనుగోలు చేసి తిన్న ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. ఆహారం తిన్న కొద్దిసేపటికే కుటుంబ సభ్యులకు తీవ్ర వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. పరిస్థితి విషమించడంతో తొలుత స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. భోజనం కోసం వెళ్లిన కుటుంబంలో ఒక్కొక్కరికి అనారోగ్య లక్షణాలు కనిపించడంతో ఆందోళన నెలకొంది.

ఆస్పత్రుల మధ్య పరుగులు.. వైద్యుల రిఫరల్

వారిలో ఓ మహిళకు నాడీ సంబంధిత సమస్యలు తలెత్తడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిని ఆశ్రయించారు. అయితే ఏడేళ్లలోపు చిన్నారులకు అక్కడ చికిత్స సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. చివరకు తొమ్మిది మందినీ మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. ఒకే కుటుంబంలోని తొమ్మిది మంది అస్వస్థతకు గురికావడం, చిన్నారులు కూడా బాధితుల్లో ఉండటం స్థానికంగా కలకలం రేపింది.

హోటళ్ల పరిశుభ్రతపై మళ్లీ ప్రశ్నలు

ఈ ఘటనతో హోటళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హోటళ్లలో వంటకాల తయారీ, నిల్వ, సరఫరా విషయంలో నిబంధనలు ఎంతవరకు పాటిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఘటనకు బిర్యానీనే కారణమని వైద్య పరీక్షలు నిర్ధారించినట్లు సమాచారం లేదు. ఆహారం తిన్న తర్వాతే అస్వస్థత మొదలవడంతో ఆహార భద్రత తనిఖీల అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.



BHARAT TODAY భారత్ టుడే
వాస్తవ నైజం
My Nation- My Respect
శుక్రవారం, నవంబర్ 20, 2026
www.barathtoday.net


ఆంథ్రోపిక్ దూకుడు

తొలిరోజే 34 శాతం లాభం

నాస్‌డాక్‌లో భారీ ఆరంభం

2 ట్రిలియన్ డాలర్లకు చేరిన విలువ

ఐపీఓ ధరను మించిన షేర్



కృత్రిమ మేధ రంగంలో సంచలనం సృష్టిస్తున్న ఆంథ్రోపిక్ సంస్థ స్టాక్ మార్కెట్‌లో అదిరిపోయే ఆరంభం చేసింది. గురువారం నాస్‌డాక్‌లో 'ఏఎన్‌టీ' టికర్‌తో ట్రేడింగ్ ప్రారంభించిన ఈ కంపెనీ షేర్లు ఐపీఓ ధర 83 డాలర్ల నుంచి 111.50 డాలర్లకు చేరాయి. దీంతో తొలిరోజే 34 శాతానికి పైగా లాభం నమోదైంది. గతంలో 70-78 డాలర్ల మధ్య ధరను నిర్ణయించాలని భావించిన సంస్థ, చివరకు 83 డాలర్లకు ఐపీఓను ఖరారు చేసింది. మొత్తం 98 కోట్ల షేర్లను విక్రయించడం ద్వారా సుమారు 81 బిలియన్ డాలర్లు సమీకరించింది. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే షేరు ధర 110 డాలర్లు దాటడంతో కంపెనీ మార్కెట్ విలువ 2 ట్రిలియన్ డాలర్లకు చేరినట్లు కథనం పేర్కొంది.

భద్రతతోనే ఏఐ అభివృద్ధి అంటున్న సీఈవో

ఐదేళ్ల క్రితం ఓపెన్‌ఏఐ నుంచి బయటకు వచ్చిన పరిశోధకులు ఆంథ్రోపిక్‌ను స్థాపించారు. సీఈవో దారియో అమోడెయ్ మాట్లాడుతూ, ఏఐ అభివృద్ధిలో మానవ నియంత్రణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఉండాలని స్పష్టం చేశారు. సంస్థ రూపొందించిన క్లాడ్ సాంకేతికత శాస్త్రీయ పరిశోధనలకు, వైద్య రంగ పురోగతికి ఉపయోగపడుతోందన్నారు. మరోవైపు, ఐపీఓ తర్వాత ఉద్యోగులు తమ వెస్టెడ్ షేర్లలో పది శాతం వరకు విక్రయించుకునే అవకాశం కల్పించారు. దీనివల్ల పలువురు ఉద్యోగులు కోటీశ్వరులయ్యే అవకాశం ఉంది. సహ వ్యవస్థాపకురాలు డానియెలా అమోడెయ్‌తో పాటు దారియో సంపద కూడా పెరగవచ్చు. అయితే తొలిరోజు వచ్చిన భారీ లాభాలు కొనసాగుతాయా, స్పేస్‌ఎక్స్ షేర్ల మాదిరిగా తగ్గుతాయా అన్నది పెట్టుబడిదారుల్లో ఆసక్తి రేపుతోంది.

కొత్తపల్లి సర్పంచ్ బరిలో వైసీపీ వీరమ్మ

ప్రొద్దుటూరు: కొత్తపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో వైసీపీ అభ్యర్థిగా పోతుబోయిన వీరమ్మను నిలబెడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే మల్లెల రమణారెడ్డి తనయుడు మల్లెల మురళీధర్ రెడ్డి ప్రకటించారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభ్యర్థిత్వాన్ని వెల్లడించారు. గతంలో తాను, తన భార్య సర్పంచులుగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేశామని, అదే అభివృద్ధిని కొనసాగించాలనే ఉద్దేశంతో వీరమ్మకు మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరమ్మ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, మల్లెల మురళీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడమే తన లక్ష్యమన్నారు.



అభివృద్ధికి రాజకీయాలు అడ్డుకావద్దు

2047 లక్ష్యంతో తెలంగాణ ప్రగతి పరుగులు

దేశాభివృద్ధే ప్రధాన ప్రాధాన్యం: సీఎం రేవంత్

దేశ భద్రత, జాతీయ ప్రయోజనాలు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం విషయంలో రాజకీయాలకు తావులేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, మిగతా సమయమంతా దేశాభివృద్ధిపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో ప్రారంభమైన ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ 85వ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే లక్ష్యంలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యంతో ముందుకు సాగుతుందని తెలిపారు. 2034 నాటికే ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం జాతీయ జీడీపీలో తెలంగాణ వాటా ఐదు శాతమని, 2047 నాటికి దానిని పది శాతానికి పెంచుతామని వెల్లడించారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రతిపాదనలకు కేంద్రం సహకరించాలని నితిన్ గడ్కరీని కోరారు.

రహదారులే ఆర్థిక ప్రగతికి పునాది

మంచి రహదారులు లేని దేశం అభివృద్ధి చెందలేదని, నాణ్యమైన రహదారులే సంపన్న దేశాల నిర్మాణానికి పునాదులని సీఎం పేర్కొన్నారు. ఓఆర్ఆర్, ప్రతిపాదిత ఆర్ఆర్ఆర్ ఆధారంగా రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఓఆర్ఆర్ లోపల క్యూర్ (CURE)లో సేవారంగం, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్యూర్ (PURE)లో భారీ తయారీ కారిడార్, ఆర్ఆర్ఆర్ వెలుపల రేర్ (RARE)లో వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. వైద్య మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనం, నిమ్స్ విస్తరణ, టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా 8 వేల పడకలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు పారిశ్రామికవేత్తలు, నిపుణులు హాజరుకావాలని ఆహ్వానించారు.

పొలం అమ్మి చదివించాడు

ఒకడు డాక్టర్, మరొకడు ఇంజినీర్

కుటుంబం కోసం కలలు కన్న తండ్రి

కన్నీటి కష్టాల నుంచి విజయ శిఖరాలకు

పొలం ఉంటేనే పూట గడిచే పేద కుటుంబం అది. రెక్కల కష్టం మీద బతికే తండ్రి.. పిల్లల భవిష్యత్తు కోసం మాత్రం ఆకాశమంత ఆశ పెట్టుకున్నాడు. బీహార్ లోని గయా జిల్లాకు చెందిన మనోజ్ కుమార్ ధాన్యం మార్కెట్ లో కూలీగా పనిచేస్తూ, రైతుల పంటల విక్రయాల్లో కమీషన్ తో కుటుంబాన్ని పోషించేవాడు. భార్య రేష్మీ దేవి గృహిణి. ఉన్న రెండు చిన్న వ్యవసాయ భూముల్లో ఒకటి అమ్మితేనే కొడుకుల చదువుకు డబ్బు సమకూరుతుందని తెలిసినా వెనక్కి తగ్గలేదు. ఒక పొలాన్ని విక్రయించి ఇద్దరు కుమారులను రాజస్థాన్ లోని కోటాకు పంపించాడు. అక్కడి అలెన్ కోచింగ్ సంస్థలో రెండేళ్ల శిక్షణ పొందిన సోదరులు తండ్రి నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు.

అనారోగ్యాన్ని జయించి..

లక్ష్యాన్ని చేరుకుని

పెద్ద కుమారుడు సోను రాజ్ నీట్ - 2026లో 636 మార్కులు సాధించి ఢిల్లీలోని సీఏపీఎఫ్ ఐఎంఎస్ వైద్య కళాశాలలో ప్రవేశానికి అర్హత పొందాడు. తమ్ముడు మోను రాజ్ జేఈఈ మెయిన్ లో 93 పర్సంటైల్ సాధించి బిర్లా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మెస్రాలో కెమికల్ ఇంజినీరింగ్ లో సీటు సంపాదించాడు. పదో తరగతిలో 96 శాతం, ఇంటర్ లో 84.5 శాతం మార్కులు సాధించిన మోను కోటాలో టైఫాయిడ్, కామెర్లతో పాటు గుండె వేగం పెరిగే సమస్యను ఎదుర్కొన్నాడు. దాదాపు మూడు నెలల పాటు జ్వరంతో బాధపడినా చదువును వదలలేదు. తండ్రి చేసిన త్యాగం తమ విజయానికి పునాదిగా నిలిచిందని సోదరులు ఆనందం వ్యక్తం చేశారు. పొలం అమ్మిన తండ్రికి చదువుల రూపంలో ఇద్దరు కొడుకులు బంగారు భవిష్యత్తును కానుకగా ఇచ్చారు.



సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యం



ప్రొద్దుటూరు, నవంబర్ 19: ప్రొద్దుటూరు మండల పరిషత్ నూతన పాలకవర్గం గురువారం బాధ్యతలు స్వీకరించింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు ప్రమాణ స్వీకారం చేయగా, ఎంపీపీగా కొప్పోలు భారతి, ఉపాధ్యక్షుడిగా సుబ్బరాయుడు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని, మండల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మున్సిపల్ ప్రతిపాదిత చైర్మన్ సంద్యాల రాఘవరెడ్డి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్తియార్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి, 2029లోనూ కూటమి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ భారతి ఎంపీటీసీల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని, తనకు అవకాశం కల్పించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

నామినేషన్ కేంద్రాలపై కలెక్టర్, ఎస్పీ నిఘా



దర్శి, నవంబర్ 19: రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజబాబు, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు గురువారం దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను సంయుక్తంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ తీరును, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రాల చుట్టూ 100 నుంచి 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు అమలు చేయాలని, పోలీస్ యాక్ట్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం నిషేధాజ్ఞలు పాటించాలని ఆదేశించారు. అనవసర గుంపులను నియంత్రిస్తూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకునేలా భద్రత కల్పించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



టీడీపీకి పంచకర్ల హెచ్చరిక

పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన పెదగాడి ఎంపీటీసీ మడక సంతోషి కుమారి బంగార్రాజును జనసేన ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీలను సత్కరించి, రానున్న ఐదేళ్లలో పెందుర్తి మండలాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. సబ్బవరం వైస్ ఎంపీపీ పదవిని టీడీపీకి కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.



జాతీయ కూచిపూడి పోటీల్లో ప్రొద్దుటూరు చిన్నారి మెరుపులు

ప్రొద్దుటూరు: కూచిపూడి నృత్యంలో ప్రొద్దుటూరుకు చెందిన చిన్నారి కె. శ్రియ రెడ్డి జాతీయ స్థాయిలో సత్తా చాటింది. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో నవంబర్ 18న నిర్వహించిన అఖిల భారత 25వ దేశవ్యాప్త సాంస్కృతిక నృత్య పోటీల్లో మూడో స్థానం కైవసం చేసుకుంది. కూచిపూడి సోలో సీనియర్ విభాగంలో తన అద్భుత ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని ఈ ఘనత సాధించింది. ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన గండ్లూరు వీర ప్రతాప్ రెడ్డి మనుమరాలైన శ్రియ విజయంతో కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. చిన్న వయసులోనే నృత్యరంగంలో ప్రతిభను చాటుతూ జాతీయ వేదికపై ప్రొద్దుటూరు పేరు నిలబెట్టిన బాలికను స్థానికులు, కళాభిమానులు అభినందించారు. శ్రియ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఖమ్మంలో జర్నలిస్టుల భూపోరు

23.2 ఎకరాలు వెంటనే

పంచాలని డిమాండ్



ఖమ్మం, నవంబర్ 19: తమకు కేటాయించిన భూమిని వెంటనే పంపిణీ చేయాలంటూ ఖమ్మం జర్నలిస్టులు ఆందోళన బాట పట్టారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ నిరసన చేపట్టారు. ప్రెస్ క్లబ్ నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి 'మా భూమి మాకు ఇవ్వండి' అంటూ నినదించారు. గత ప్రభుత్వం జీవో 147 ద్వారా క్యాబినెట్ ఆమోదంతో ఖమ్మం జర్నలిస్టులకు 23.2 ఎకరాలు కేటాయించినా, మూడేళ్లుగా పంపిణీ చేయకపోవడంపై జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 18 మంది జర్నలిస్టులు మరణించినా వారి కుటుంబాల ఆకాంక్ష నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు దశలవారీ ఉద్యమం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.



పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

మహబూబ్‌నగర్: దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఏడు గ్రామాల్లో నూతన పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనంపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దంతనూరు, అజ్జకొల్లు, మదనాపురం, కొత్తపల్లి, తిరుమలాయపల్లి, కొన్నూరు, గోపాన్‌పేట గ్రామాల్లో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఆయా గ్రామాల సర్పంచుల చేతుల మీదుగా పత్రాలు అందజేశారు. అనంతరం కొన్నూరులో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. కొత్త పింఛన్లు అర్హులైన వారికి ఆర్థిక భరోసాతో పాటు ఆత్మగౌరవంతో జీవించే అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ రైల్వే స్టేషన్‌కు అంతర్జాతీయ హంగులు

రూ.660 కోట్లతో భారీ ఆధునికీకరణ

14 ప్లాట్‌ఫారాలు.. 2028 డిసెంబర్ కి పూర్తి లక్ష్యం



విశాఖపట్నం రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో దేశంలోనే అత్యుత్తమ స్టేషన్లలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు రూ.660 కోట్లతో చేపడుతున్న ఆధునికీకరణ పనులను ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ గురువారం రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న 8 ప్లాట్‌ఫారాలను 14కు పెంచేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. విమానాశ్రయ తరహాలో 72 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఎయిర్ కాంకోర్స్‌లో ఒకేసారి 4 వేల మంది వేచి ఉండే సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు. గోపాలపట్నం నుంచి విశాఖ వరకు రైల్వే లైన్ల విస్తరణతో పాటు సింహాచలం బైపాస్ పనులు పూర్తయితే రైళ్ల సమయపాలన 7374 శాతం నుంచి 9596 శాతానికి పెరుగుతుందని వివరించారు. 450 కార్లు, 2 వేల ద్విచక్ర వాహనాలకు పార్కింగ్, ఫుడ్ కోర్టులు, ఏసీ లాంజ్‌లు, సోలార్ ప్యానెల్స్, నీటి పునర్వినియోగ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. మొదటి దశను 2027 డిసెంబర్ నాటికి, పూర్తి ప్రాజెక్టును 2028 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని శ్రీభరత్ తెలిపారు.

ఎగ్జిబిషన్ బకాయిలు వసూలు చేయాలి



ప్రొద్దుటూరు, నవంబర్ 19: దసరా ఎగ్జిబిషన్‌కు సంబంధించి మున్సిపాలిటీకి రావాల్సిన రూ.1.63 కోట్ల బకాయిలను వెంటనే వసూలు చేయాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దొర సానిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిర్వాహకులు ఇప్పటివరకు కేవలం రూ.55 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన బకాయిల వసూళ్లలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. పూర్తి సొమ్ము వసూలు చేయకుండానే ఎగ్జిబిషన్‌కు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, టీడీపీ మాజీ ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ అధికారులు బాధ్యత వహించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రజాధనాన్ని కాపాడాలని, బకాయిలు వసూలు చేయకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

వాస్తవ నైజం
BHARAT TODAY భారత్ టుడే
My Nation- My Respect
శుక్రవారం 20 నవంబర్ 2026
www.barathtoday.net

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనదైన వ్యూహంతో ముందుకు సాగుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఇప్పటివరకు ముఖ్యమంత్రి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన రాజగోపాల్‌రెడ్డి.. ఇకపై అదే అంశాన్ని రాజకీయ అస్త్రంగా మలుచుకోవాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీని రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్న రాజకీయ సిద్ధాంతంతోనే ముఖ్యమంత్రి నిలదీస్తూ.. తన వాదనకు బలం చేకూర్చాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాని దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని రేవంత్ కోరుతున్నప్పుడు, తెలంగాణలోని అన్ని నియోజకవర్గాలకు ముఖ్యమంత్రి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారా అన్న వాదనను తెరమీదకు తెచ్చేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొత్త వాదనను తెరమీదకు తెచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. తాజాగా రేవంత్ రెడ్డి, మునుగోడుకు నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని బహిరంగ విమర్శలు చేసిన రాజగోపాల్.. ఈసారి లాజిక్‌తో సీఎంను కార్నర్ చేసేందుకు వ్యూహం సిద్ధం చేసినట్లు సమాచారం. తాను విన్పిస్తున్న వాదన, ధిక్కార స్వరం కాదని... గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొడంగల్‌కు అన్యాయం చేశారని.. రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను స్ఫూర్తిగా తీసుకొని, తానిప్పుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు రాజగోపాల్ రెడ్డి ట్విస్ట్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. ఈ లాజిక్ ద్వారా, కోమటిరెడ్డి ఒకే దెబ్బకు మూడు పిట్టలను కొట్టినట్లు అవుతుందని భావిస్తున్నట్లు సమాచారం. రేవంత్ రెడ్డితోపాటు, తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని మోదీని, గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపారని కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ.. కీలక పదవుల్లో ఉన్న వారందరినీ రాజగోపాల్ నిలదీయాలని రాజగోపాల్ రెడ్డి భావిస్తున్నారు. తాను పార్టీ ధిక్కరణకు పాల్పడటం లేదని ముఖ్యమంత్రి పాలనకు సంబంధించి సూచనలు హక్కు... తెలంగాణలోని ప్రతి పౌరుడికి ఉంటుందని.. అదే తరహాలో మునుగోడు ప్రజల పక్షాన తాను ఈ వాదన విన్పిస్తున్నానని.. రాజగోపాల్ రెడ్డి తన వైఖరిని సమర్థించుకోనున్నట్లు తెలుస్తోంది. పొలిటికల్ లీడర్‌కి కసి ఉంటే చాలదు.. కంటెంట్ ఉండాలి అనే విషయం తమ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేస్తున్న వాదనను వింటే అర్థమవుతుందని మునుగోడు వాసులంతా చర్చించుకుంటున్నారు.





- పీఎం చేస్తే తప్పు.. సీఎం చేస్తా ఒప్పా..!?
- రూల్ ఈజ్ రూల్.. రూల్ ఫర్ ఆల్
- కొత్త అస్త్రంతో రేవంత్‌ను ఫిక్స్ చేస్తారా?
- హైకమాండ్ ముందు అడ్డంగా ఇరికించే స్ట్రాటజీ
- మోదీపై గుజరాత్ అస్త్రం.. కొడంగల్‌పై రాజన్న బ్రహ్మాస్త్రం

రేవంత్ లాజిక్.. రివర్స్ ఎటాక్

ప్రధాని మోదీని ప్రశ్నించే స్వేచ్ఛ రేవంత్‌రెడ్డికి ఉన్నప్పుడు, రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రశ్నించే హక్కు తనకు ఎందుకు ఉండకూడదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ సమానంగా ఉండాలన్న అంశాన్ని ఆయన తన వాదనలో ప్రధానంగా ప్రస్తావించనున్నట్లు సమాచారం. ఒకవేళ పార్టీ తనపై క్రమశిక్షణ చర్యలకు ప్రయత్నిస్తే, అదే ప్రమాణాలు ముఖ్యమంత్రి వ్యవహారశైలికి కూడా వర్తిస్తాయా అని ప్రశ్నించే దిశగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ వివాదం కేవలం ఒక ఎమ్మెల్యే అసంతృప్తిగా చూడాల్సిన అంశం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికార వికేంద్రీకరణ, నియోజకవర్గాల అభివృద్ధి, పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం వంటి కీలక అంశాలతో ముడిపడిన పరిణామంగా మారుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రాజగోపాల్‌రెడ్డి తదుపరి అడుగులు ఎలా ఉంటాయన్నది ఆయన అధికారిక ప్రకటనలతోనే స్పష్టమవుతుంది. పార్టీ నియామాలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ కిందకు వస్తుంది. ముఖ్యమంత్రిని విమర్శిస్తే అది క్రమశిక్షణ కిందకు రాదన్న లాజిక్‌ను కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందుకు తెస్తున్నారు.

నాకేం కావాలన్న మాట ఆయన ఇప్పుడు మాట్లాడటం లేదు. తనను నమ్మి గెలిపించుకున్న నియోజకవర్గానికి నిధులివ్వమని మాత్రమే అడుగుతున్నారు. గతంలో రేవంత్ రెడ్డి తన నియోజకవర్గానికి నిధులివ్వాలని, వివక్ష చూపించొద్దని అనేకమార్లు అడిగేవాడని కొడంగల్ వాసులు చెబుతున్నారు. ఇప్పుడు అదే వాదన రాజన్న కూడా విన్పిస్తున్నారని మునుగోడు వాసులు చెబుతున్నారు. ఇదే ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

• కొడంగల్‌కే రూ.20 వేల కోట్లా? మిగతా నియోజకవర్గాల పరిస్థితి ఏమిటి?

రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తికి ప్రధాన కారణం నియోజకవర్గాల అభివృద్ధికి నిధుల కేటాయింపులో సమతుల్యత లేదన్న ఆరోపణ. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి భారీగా నిధులు కేటాయించడంపై ఆయన బహిరంగంగానే ప్రశ్నలు సంధించారు. కొడంగల్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కాదు, అవసరమైతే రూ.20 వేల కోట్లు ఖర్చు చేసుకోవచ్చని, అయితే మిగతా నియోజకవర్గాలను కూడా పట్టించుకోవాలని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం అభివృద్ధి చెందడాన్ని తాను వ్యతిరేకించడం లేదని, అదే సమయంలో ఇతర ప్రాంతాల ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు అందాలని ఆయన వాదనగా కనిపిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి అవసరమైన రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అభిప్రాయం. ఒక నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినప్పుడు, మిగతా ప్రాంతాలకు కూడా వాటి అవసరాలకు అనుగుణంగా నిధులు ఇవ్వాలన్నది ఆయన ప్రధాన డిమాండ్‌గా ఉంది. ముఖ్యమంత్రి నియోజకవర్గం అభివృద్ధి చెందడం ఎంత ముఖ్యమో, మిగతా నియోజకవర్గాల అభివృద్ధి కూడా అంతే ముఖ్యం అన్న సందేశాన్ని ఆయన తన వ్యాఖ్యల ద్వారా వినిపించారు. మధిర, కొడంగల్ వంటి ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తున్నప్పుడు మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న కాంగ్రెస్‌లోని కొందరు ఎమ్మెల్యేల నుంచి కూడా వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని నియోజకవర్గాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చిందని కాంగ్రెస్ నేతలు విమర్శించేవారు. అప్పుడు అభివృద్ధి సమానంగా జరగాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్రమాణాన్ని పాటిస్తోందా అన్నది రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నలో అంతర్లీనంగా కనిపిస్తోంది. నిధుల కేటాయింపులో పారదర్శకత, అభివృద్ధి పనుల ప్రాధాన్యత, ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఇచ్చే స్పందన వంటి అంశాలపై స్పష్టత కోరడం ద్వారా ఆయన తన రాజకీయ వాదనను మరింత బలపరచాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.

• పార్టీ కోసం పనిచేశా.. ఇప్పుడు నా నియోజకవర్గానికే అన్యాయమా?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తాను చేసిన రాజకీయ కృషిని కూడా రాజగోపాల్‌రెడ్డి ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. నాడు తాను తీసుకున్న నిర్ణయాల వల్ల బీఆర్ఎస్ పార్టీ దెబ్బతిందని.. 2023లో ఓడిపోవడానికి కారణం కూడా తాను ఒక కీలక భూమిక పోషించానన్న భావనలో ఆయన ఉన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తల్లో ఉత్సాహం నింపడం, నాయకులను సమన్వయం చేయడం, ప్రజల్లో పార్టీకి మద్దతు పెంచడం వంటి అంశాల్లో తాను కీలక పాత్ర పోషించానని ఆయన భావిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యల ద్వారా అర్థమవుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం సహజమని, వాటిని రాజకీయ విభేదాలుగా చూడకూడదని ఆయన అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ముసుగోడు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి ప్రతిపాదనలు, ప్రజల సమస్యలు పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని ఆయన పదేపదే ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తన నియోజకవర్గానికి సంబంధించిన పనుల విషయంలో ప్రభుత్వ స్థాయిలో ఆశించిన స్పందన రావడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన నాయకులకు, ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం నుంచి తగిన ప్రాధాన్యం లభించకపోతే పార్టీ అంతర్గతంగా అసంతృప్తి పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం పనిచేసిన ఎమ్మెల్యే తన నియోజకవర్గ అభివృద్ధి కోరితే అది క్రమశిక్షణ ఉల్లంఘన ఎలా అవుతుంది? అన్నది రాజగోపాల్‌రెడ్డి వాదనలో కీలకంగా మారుతోంది. ఎమ్మెల్యేలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అందుకోసం ముఖ్యమంత్రిని, సంబంధిత మంత్రులను ప్రశ్నించడం వారి బాధ్యతలో భాగమేనని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి నిర్ణయాలపై ప్రశ్నలు అడిగినంత మాత్రాన పార్టీ వ్యతిరేకులుగా ముద్ర వేయడం సరికాదన్న అంశాన్ని కూడా ఆయన తెరపైకి తీసుకురావాలనుకుంటున్నట్లు సమాచారం. ఒకవైపు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇస్తూనే, మరోవైపు నియోజకవర్గాలకు న్యాయం జరగాలని పట్టుబట్టే రాజకీయ విధానాన్ని అనుసరించాలని ఆయన భావిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగత అసంతృప్తిని దాటి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వంతో వారి సంబంధాలపై విస్తృత చర్చకు దారితీస్తున్నాయి.

• మోదీని ప్రశ్నించే రేవంత్.. తనను ప్రశ్నిస్తే అభ్యంతరమెందుకు?

ఈ మొత్తం వ్యవహారంలో రాజగోపాల్‌రెడ్డి ముందుకు తీసుకొస్తున్న ప్రధాన రాజకీయ అస్త్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో చేసిన విమర్శలే. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లిస్తున్నారని రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ఆరోపించారు. దేశానికి ప్రధానిగా ఉండాల్సిన మోదీ గుజరాత్ ప్రధానిలా

• రాజగోపాల్ తదుపరి అడుగు ఏమిటి? కాంగ్రెస్‌కు కొత్త పరీక్ష!

ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం ఎటువైపు మలుపు తిరుగుతుందన్నది రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో నేరుగా ఘర్షణకు దిగుతారా? లేక నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల కేటాయింపు, ఎమ్మెల్యేల ప్రాధాన్యత వంటి అంశాలను ముందుకు తీసుకొచ్చి తన వాదనను బలపరుస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఆయన వ్యూహంలో ప్రధానంగా కనిపిస్తున్న అంశం రేవంత్‌రెడ్డి గతంలో ఉపయోగించిన రాజకీయ విమర్శలనే తిరిగి ముఖ్యమంత్రి ఎదుట ఉంచడం. ఇతర రాష్ట్రాలకు న్యాయం జరగాలని ప్రధాని మోదీని ప్రశ్నించిన ముఖ్యమంత్రి, తెలంగాణలోని అన్ని నియోజకవర్గాలకు కూడా సమాన న్యాయం చేయాలని డిమాండ్ చేయడం ద్వారా రాజకీయంగా కొత్త చర్చకు తెరతీయవచ్చని భావిస్తున్నారు. ఒకవైపు పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణపై స్పష్టమైన సంకేతాలు ఇస్తుండగా... మరోవైపు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కోరుతున్నారు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత సాధించడం కాంగ్రెస్ నాయకత్వానికి సవాలుగా మారవచ్చు. ముఖ్యమంత్రి తన నియోజకవర్గానికి కేటాయిస్తున్న నిధులు, ఇతర ప్రాంతాలకు ప్రకటిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఎమ్మెల్యేల నుంచి వస్తున్న ప్రతిపాదనలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది. ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం ఎంత బలంగా ఉంటే ప్రభుత్వ పనితీరు అంత సజావుగా సాగుతుందన్నది రాజకీయంగా ప్రాధాన్యం కలిగిన అంశం. అసంతృప్తిని క్రమశిక్షణ సమస్యగా మాత్రమే చూడకుండా, దాని వెనుక ఉన్న అభివృద్ధి సంబంధిత డిమాండ్లను పరిశీలించాల్సిన అవసరం కూడా ఉంది. అదే సమయంలో పార్టీ నాయకులు బహిరంగ వ్యాఖ్యలు చేసే విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న అధిష్ఠానం అభిప్రాయాన్ని కూడా విస్మరించలేం. రాజగోపాల్‌రెడ్డి తన రాజకీయ వ్యూహాన్ని ఏ స్థాయికి తీసుకెళ్తారు? రేవంత్‌రెడ్డి ఆయన ప్రశ్నలకు సమాధానం చెబుతారా? కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని వివాదానికి ముగింపు పలుకుతుందా? అన్న ప్రశ్నలు ఉత్కంఠ రేపుతున్నాయి. మొత్తానికి రేవంత్ ప్రశ్నించిన రాజకీయ సిద్ధాంతాన్నే రేవంత్ ఎదుట నిలబెట్టడం రాజగోపాల్‌రెడ్డి తాజా రాజకీయ వ్యూహంలో కీలక అంశంగా కనిపిస్తోంది. ఈ పరిణామం కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత ప్రజాస్వామ్యానికి పరీక్షగా మారుతుందా? లేక మరోసారి పార్టీ పెద్దల జోక్యంతో సద్దుమణుగుతుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

• కొండా సురేఖ ఉదంతం.. క్రమశిక్షణ పేరుతో చర్యలుంటాయా?

రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం స్పందించడం ఈ వివాదానికి మరో కోణాన్ని జోడించింది. పార్టీకి చెందిన నాయకులు బహిరంగంగా చేసే వ్యాఖ్యలను అధిష్ఠానం గమనిస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ వెల్లడించారు. రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్ చేసిన వ్యాఖ్యలను పార్టీ పరిశీలిస్తోందని స్పష్టం చేశారు. క్రమశిక్షణ విషయంలో అందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. తమది ప్రజాస్వామ్య పార్టీ అని, ప్రతి అంశానికి తగిన సమయం ఉంటుందని వ్యాఖ్యానించారు. గతంలో కొండా సురేఖ విషయంలో కూడా చర్యలు తీసుకునే ముందు పలుమార్లు అవకాశం ఇచ్చామని గుర్తుచేశారు. కొత్త పార్టీ ఇన్‌ఛార్జి సందీప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని అంశాలను పరిశీలించి, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారని వివరించారు. ఈ వ్యాఖ్యలు రాజగోపాల్‌రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించిందనే సంకేతాలను ఇచ్చాయి. అయితే ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు స్పష్టత లేదు. ఇదే సమయంలో రాజగోపాల్‌రెడ్డి తనపై చర్యలు తీసుకునే పరిస్థితి వస్తే వెనక్కి తగ్గకూడదనే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖ విషయంలో పార్టీ అనుసరించిన విధానాన్ని తన విషయంలోనూ అమలు చేస్తారా అన్నది ఆయన ప్రశ్నగా మారవచ్చని తెలుస్తోంది. తాను కొండా సురేఖ కాదని, తన రాజకీయ నేపథ్యం, పార్టీ కోసం చేసిన కృషి, తనకు ఉన్న ప్రజా మద్దతు వేరు అని చెప్పాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తనను క్రమశిక్షణ పేరుతో కట్టడి చేయడానికి ప్రయత్నిస్తే, కాంగ్రెస్ పార్టీతో పాటు ముఖ్యమంత్రి కూడా రాజకీయంగా మూల్యం చెల్లించుకునే పరిస్థితులు తీసుకురావడానికి వెనుకాడబోనని ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఇవన్నీ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న అంచనాలే తప్ప, ఆయన నుంచి వచ్చిన అధికారిక ప్రకటనలుగా పరిగణించలేం. అయినప్పటికీ పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలతో ఈ వివాదం వ్యక్తిగత స్థాయిని దాటి పార్టీ క్రమశిక్షణ, అంతర్గత స్వేచ్ఛ, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాల చుట్టూ తిరుగుతోంది. అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కాంగ్రెస్‌లోని ఇతర అసంతృప్త నేతల వైఖరిపైనా ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు రావాల్సిన పెట్టుబడులు, పరిశ్రమలు, కేంద్ర ప్రాజెక్టుల విషయంలో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రధానిపై ఉందని స్పష్టం చేశారు. ఈ వాదనను ఇప్పుడు రాజగోపాల్‌రెడ్డి తెలంగాణ రాజకీయాలకు అన్వయించాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ గుజరాత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని రేవంత్ ప్రశ్నిస్తే, తెలంగాణలో ముఖ్యమంత్రి తన నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని రాజగోపాల్‌రెడ్డి వాదించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. ఇతరులను ప్రశ్నించే హక్కు ఉన్నప్పుడు, తనను ప్రశ్నించే హక్కును కూడా అంగీకరించాలన్నది ఈ వ్యూహంలోని ప్రధాన సూత్రంగా కనిపిస్తోంది. మోదీని ప్రశ్నించడం రాజకీయ బాధ్యతగా భావించే రేవంత్‌రెడ్డి, సొంత పార్టీ ఎమ్మెల్యేలు తన నిర్ణయాలను ప్రశ్నించినప్పుడు కూడా అదే ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించాలన్న సందేశాన్ని ఆయన ఇవ్వాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను తప్పుగా పరిగణిస్తే, గతంలో ప్రధాని మోదీపై చేసిన విమర్శలకు కూడా అదే ప్రమాణాలు వర్తిస్తాయా అని నిలదీసే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే కేంద్రం, రాష్ట్రం మధ్య నిధుల కేటాయింపులు, పెట్టుబడుల మళ్లింపు ఆరోపణలు, ఒక నియోజకవర్గానికి రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించడం వంటి అంశాలు పరిపాలనా పరంగా వేర్వేరు అంశాలు. అయినప్పటికీ సమానత్వం, పారదర్శకత, ప్రశ్నించే హక్కు అనే రాజకీయ సూత్రాలను ముందుకు తీసుకొచ్చి ముఖ్యమంత్రిని ఇరకాటంలో పెట్టాలన్నది రాజగోపాల్‌రెడ్డి వ్యూహంగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ వాదనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

వాస్తవ నైజం
భారత్ టుడే
BHARAT TODAY
My Nation- My Respect
శుక్రవారం 20 నవంబర్ 2026
www.barathtoday.net

ఏకగ్రీవాల సంబరం

పదవులు పంచుకున్న నేతలు..
ఓటు హక్కు కోల్పోయిన ప్రజలు!





- రాయలసీమలో అసంతృప్తి జ్వాలలు
- అధికార పార్టీకి ప్రజాస్వామ్య హెచ్చరిక!
- సంబరాల వెనుక మరో వాస్తవం నిశ్శబ్దం

రాయలసీమలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ముగుస్తున్నా.. రాజకీయంగా మరో చర్చ మొదలైంది. కూటమి నాయకులు ఏకగ్రీవాల విజయాలను తమ రాజకీయ బలానికి నిదర్శనంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా విజయోత్సవాలు. ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు. ఏకగ్రీవాలే ప్రజా తీర్పుగా అభివర్ణించుకుంటున్నారు. అయితే ఈ సంబరాల వెనుక మరో వాస్తవం నిశ్శబ్దంగా పేరుకుపోతోంది. అది ఓటర్ల అసంతృప్తి. ఎన్నికల్లో ఓడిపోయామన్న బాధ కాదు. తమకు ఓటు వేసే అవకాశం లేకుండా పోయిందన్న మానసిక ఒత్తిడి. తమ పట్టణాలు, గ్రామాలకు ఎవరు ప్రాతినిధ్యం వహించాలో తాము నిర్ణయించుకోలేకపోయామన్న ఆవేదన. ప్రజాస్వామ్యంలో ఓటమి సహజం. గెలుపు సహజం. కానీ ఓటు వేసే అవకాశమే లేకుండా పోవడం మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చించాల్సిన పరిణామం. నాయకులు పదవులు పంచుకున్నప్పుడు ప్రజలు ప్రేక్షకులుగా మిగిలిపోవడం రాజకీయంగా చిన్న విషయం కాదు. ఏకగ్రీవాల సంఖ్యను చూపించి రాజకీయ విజయాన్ని ప్రకటించుకోవచ్చు. కానీ ఆ ప్రక్రియలో ఓటర్ల మనసుల్లో ఏర్పడిన అసంతృప్తిని ఫ్లెక్సీలతో కప్పిపుచ్చలేరు.

ఓటు హక్కు వినియోగించుకోలేకపోయామన్న భావనలో ప్రజలు

బనగానపల్లెలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో సర్పంచ్ ఎన్నికలపైనా రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీల మధ్య సయోధ్యలు, స్థానిక నాయకుల మధ్య ఒప్పందాలు, పోటీ లేకుండా పదవులను పంచుకునే ప్రయత్నాలు జరుగుతాయన్న ప్రచారం ఉంది. అయితే అలాంటి ప్రచారాలను నిర్ధారిత వాస్తవాలుగా చూడలేం. కానీ ఇప్పటికే ఓటు హక్కు వినియోగించుకోలేకపోయిన ప్రజల్లో ఈ చర్చ మరింత అసహనాన్ని పెంచుతోంది. ఎంపీటీసీ ఎన్నికల్లో తమకు అవకాశం రాలేదు. జడ్పీటీసీ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లో కూడా తమ అభిప్రాయానికి విలువ లేకుండా పోతుందా అన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. గ్రామంలో ఎవరు నాయకుడిగా ఉండాలో నిర్ణయించుకునే హక్కు గ్రామస్తులది. పార్టీల నాయకులు పరస్పరం చర్చించుకోవచ్చు. అభ్యర్థులను బలపరచవచ్చు. ఏకగ్రీవానికి ప్రయత్నించవచ్చు. కానీ ప్రజల స్వచ్ఛంద అంగీకారం లేకుండా కుదిరిన రాజకీయ ఒప్పందాన్ని ప్రజా తీర్పుగా చిత్రీకరించలేరు. స్థానిక నాయకుల మధ్య సయోధ్య కుదిరినంత మాత్రాన గ్రామంలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని అర్థం కాదు. ఇక్కడ ఓటర్ల మానసిక స్థితిని రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా అర్థం చేసుకోవాలి. ఎన్నికల్లో ఓటుకు డబ్బులు పంచలేదన్న అసంతృప్తి కాదు ఇది. తమ ఓటును వినియోగించుకునే అవకాశమే లేకుండా పోయిందన్న బాధ. తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయలేకపోయామన్న వెలితి. తమ గ్రామ భవిష్యత్తును నిర్ణయించే విషయంలో తమను పక్కనపెట్టారన్న మానసిక ఒత్తిడి. డబ్బులు, పదవులు, రాజకీయ లెక్కలు అన్నీ నాయకుల మధ్యే తిరుగుతున్నప్పుడు ప్రజల పాత్ర ఏమిటన్న ఆగ్రహం. ఒకవైపు పదవుల కోసం నేతలు బేరసారాలు చేసుకుంటున్నారన్న ప్రచారం. మరోవైపు ఓటర్లు మాత్రం తమ హక్కును వినియోగించుకోలేని పరిస్థితి. ఈ వైరుధ్యమే గ్రామీణ రాజకీయాల్లో కొత్త అసంతృప్తికి కారణమవుతోంది. ప్రజలు నిశ్శబ్దంగా ఉన్నారని వారి మనసుల్లో అసహనం లేదనుకోవడం పొరపాటు. ఎన్నికల సమయంలో బయటపడని అసంతృప్తి మరొక సందర్భంలో రాజకీయంగా వ్యక్తమవుతుంది. గ్రామాల్లో ఎవరు ఏ పార్టీకి ఓటు వేశారన్నది నాయకులకు తెలిసి ఉండవచ్చు. కానీ ఓటు వేయలేకపోయిన వారి మనసుల్లో ఎవరిపై అసంతృప్తి పేరుకుపోయిందో తెలుసుకోవడం అంత సులభం కాదు.

రాయలసీమలో ఈ పరిస్థితికి కొన్ని నియోజకవర్గాలు అద్దం పడుతున్నాయి. బనగానపల్లెలో **85** ఎంపీటీసీ స్థానాలు, ఐదు జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగకుండానే ఏకగ్రీవాలు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అక్కడ **70/30** ఫార్ములా పేరుతో రాజకీయ సర్దుబాట్లు జరిగాయన్న కథనాలు కూడా వెలువడ్డాయి. పులివెందులలో **65** ఎంపీటీసీ స్థానాలకు గాను **64** ఏకగ్రీవం కావడం మరో విశేషం. ఒక్క అలిరెడ్డిపల్లెలో మాత్రమే పోలింగ్ జరిగింది. కడప జిల్లాలో **407** ఎంపీటీసీ స్థానాలకు గాను **352** ఏకగ్రీవం కావడం కూడా ఇదే పరిస్థితిని సూచిస్తోంది. ఈ గణాంకాలను అధికార పార్టీ తన విజయంగా చెప్పుకోవచ్చు. కానీ ప్రజాస్వామ్య కోణంలో చూస్తే ఇవి మరో చర్చకు తావిస్తున్నాయి. ఇన్ని స్థానాల్లో ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కోల్పోయారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాలకు, మండలాలకు ప్రాతినిధ్యం వహించవచ్చు. కానీ వారిని ఎన్నుకునే ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం లేకపోవడం మాత్రం రాజకీయంగా గుర్తించాల్సిన అంశం. ఏకగ్రీవం కావడం తప్పు కాదు. ఏకగ్రీవానికి దారితీసిన పరిస్థితులు స్వచ్ఛందమైనవా, ఒత్తిళ్లతో కూడుకున్నవా అన్నదే అసలు విషయం.

• స్థానిక ఆధిపత్య పోరాటాల ఆరోపణలు

ఇక్కడ మరో కోణం కూడా ఉంది. ఏకగ్రీవాల వెనుక రాజకీయ సయోధ్యలు, ఆర్థిక లావాదేవీలు, అభ్యర్థుల ఉపసంహరణలు, స్థానిక ఆధిపత్య పోరాటాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమలాపురం ప్రాంతంలో ఒక్కో ఓటుకు రూ.8 వేల వరకు ఆఫర్ చేశారన్న ప్రచారం, 240 ఓట్లున్న గ్రామంలో సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేసేందుకు సిద్ధపడ్డారన్న సమాచారం రాజకీయ వర్గాల్లో చర్చకు వచ్చింది. వేలంపాటల వ్యవహారం కూడా ఈ రాజకీయాల్లో మరో చీకటి కోణాన్ని బయటపెట్టింది. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను డబ్బుతో వేలం వేసి దక్కించుకునే ప్రయత్నాలను రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. వేలం ఆరోపణలు వచ్చిన పంచాయతీల్లో విచారణ జరపాలని, ప్రాథమిక ఆధారాలు లభిస్తే ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఏకగ్రీవ ఫలితాలను కూడా కలెక్టర్ అనుమతి లేకుండా ప్రకటించరాదని స్పష్టం చేసింది. అంటే వేలం ద్వారా పదవులు దక్కించుకునే ప్రయత్నాలను ఎన్నికల సంఘం సాధారణ రాజకీయ సర్దుబాటుగా చూడలేదు. ఎన్నికల అక్రమంగా పరిగణించి చర్యలకు ఉపక్రమించింది. ఇక్కడ అసలు ప్రమాదం ఒక్కో ఓటుకు ఎంత డబ్బు ఇచ్చారన్నది మాత్రమే కాదు. ప్రజాప్రతినిధి పదవులు ప్రజా సేవకు కాకుండా పెట్టుబడి పెట్టి సంపాదించుకునే అవకాశాలుగా మారుతున్నాయన్న భావన ప్రజల్లో బలపడటం. ఒక పదవిని దక్కించుకోవడానికి లక్షలు వెచ్చించే నాయకుడు ఆ మొత్తాన్ని ఎక్కడి నుంచి తిరిగి సంపాదించుకుంటాడు? గ్రామాభివృద్ధి కోసం వచ్చిన నిధులను ఎలా వినియోగిస్తాడు? ప్రజల అవసరాల కంటే తన పెట్టుబడికి ప్రాధాన్యత ఇస్తాడా? ఇలాంటి ఆలోచనలు ఓటర్లలో సహజంగానే వస్తాయి. పదవుల కోసం డబ్బు పెట్టిన నాయకులు ఉన్నప్పుడు ప్రజలు మాత్రం బలిపశువులుగా మిగిలిపోవాలా అన్న ఆగ్రహం గ్రామాల్లో వ్యక్తమవుతోంది. పదవులు అమ్ముకునే రాజకీయ వ్యవస్థలో ఓటు హక్కు విలువను ఎవరు కాపాడతారన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

• గ్రామానికి నిధులు కావాలంటే ఓటు హక్కును వదులుకోవాలా?

ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలకు ప్రభుత్వం ప్రకటించే ప్రోత్సాహక నిధులు కూడా ఈ చర్చలో భాగమయ్యాయి. జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందించే విధానం ఉంది. గ్రామానికి అదనపు నిధులు రావడం మంచి పరిణామమే. అభివృద్ధి కోసం గ్రామస్తులు ఏకాభిప్రాయానికి రావడం కూడా అభినందించాల్సిందే. కానీ ఆర్థిక ప్రోత్సాహకం కోసం ఎన్నికల పోటీని పూర్తిగా పక్కనపెట్టే పరిస్థితి ఏర్పడితే మాత్రం దాని ప్రభావం ప్రజాస్వామ్యంపై పడుతుంది. గ్రామానికి నిధులు కావాలంటే ఓటు హక్కును వదులుకోవాలా? ఎన్నికల్లో పోటీ లేకుండా చేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమా? ప్రజలు ఓటు వేసి ఎన్నుకున్న సర్పంచ్‌కు కూడా అభివృద్ధి నిధులు అందించవచ్చు కదా? అనే భావన ప్రజల్లో ఉంది. ఏకగ్రీవం అనేది గ్రామస్తులందరి స్వచ్ఛంద నిర్ణయంగా వచ్చినప్పుడు దానికి విలువ ఉంటుంది. రాజకీయ నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం గ్రామ ప్రజల నిర్ణయంగా ప్రచారం పొందినప్పుడు మాత్రం అది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా కనిపిస్తుంది. గ్రామానికి వచ్చే నజరానా కంటే గ్రామస్తుల ఓటు హక్కు విలువైనది. ఆ విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాలి. అయితే పోలింగ్ జరిగిన ప్రాంతాల ఫలితాలు అధికార కూటమికి మరో సందేశాన్ని ఇస్తున్నాయి. ఏకగ్రీవాలు జరిగిన చోట్ల గెలుపు లెక్కలు చెప్పుకోవడం సులభం. కానీ ఎన్నికలు జరిగిన చోట ఓటర్లు ఎవరికి మద్దతు ఇచ్చారన్నది రాజకీయంగా మరింత ప్రాధాన్యమైన విషయం. నందికొట్కూరు మున్సిపాలిటీలో వైసీపీ సాధించిన విజయం కూటమి నాయకత్వానికి ఒక రాజకీయ సంకేతం. అధికార పార్టీకి అనుకూలమైన రాజకీయ వాతావరణం ఉన్నప్పటికీ, ప్రతిపక్షానికి ఓటు వేసే అవకాశం వచ్చినప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవచ్చని ఆ ఫలితం సూచించింది. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పరిధిలోనే వైసీపీ విజయం సాధించడం కూడా కూటమికి అంతర్గతంగా ఆలోచించాల్సిన అంశం. స్థానిక నాయకత్వం, అభ్యర్థుల ఎంపిక, ప్రజలతో సంబంధాలు, స్థానిక సమస్యలపై స్పందన.. ఇవన్నీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి.

అధికారంలో ఉన్నామనే కారణంతో ప్రతి చోటా ప్రజల మద్దతు తమకే ఉంటుందని భావించడం రాజకీయ అపరిపక్వతే అవుతుంది. పోలింగ్ జరిగితే ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తారు. ఆ తీర్పును అంగీకరించాల్సిందే. అదే ప్రజాస్వామ్యం.

• వేలం ఆరోపణలతో కొన్ని పంచాయతీల్లో ప్రక్రియ నిలిపివేత

అనంతపురం కార్పొరేషన్ ఫలితాలు, అన్నమయ్య జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫలితాలు కూడా వైసీపీ పూర్తిగా కనుమరుగైందన్న ప్రచారానికి భిన్నమైన పరిస్థితిని చూపించాయి. రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ జరిగిన 582 జడ్పీటీసీ స్థానాల్లో కూటమి 499 స్థానాలు గెలుచుకోగా, వైసీపీ 76 స్థానాలు సాధించింది. అలాగే పోలింగ్ జరిగిన 7,768 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి 5,861, వైసీపీ 1,711 స్థానాలు గెలుచుకున్నట్లు ప్రకటించిన లెక్కలు చెబుతున్నాయి. అంటే పోటీ జరిగిన చోట వైసీపీకి కూడా గణనీయమైన ప్రాతినిధ్యం దక్కింది. ఈ ఫలితాలను చూసి కూటమి బలహీనపడిందని చెప్పడం ఎంత తొందరపాటో, ఏకగ్రీవాలన్నీ ప్రజా మద్దతుతోనే వచ్చాయని చెప్పడం కూడా అంతే తొందరపాటు. కూటమికి స్పష్టమైన రాజకీయ ఆధిక్యం ఉంది. అదే సమయంలో ప్రతిపక్షానికి కూడా ప్రజల్లో కొంతమేర మద్దతు కొనసాగుతోంది. ఎన్నికల రాజకీయాల్లో ఈ రెండు వాస్తవాలను అంగీకరించాలి. గెలిచిన పార్టీ తన విజయాన్ని ఆస్వాదించవచ్చు. కానీ గెలుపు వెనుక ఉన్న పరిమితులను గుర్తించకపోతే భవిష్యత్తులో అదే విజయాలు భారంగా మారవచ్చు. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల వైపు చూస్తే అసలు రాజకీయ పరీక్ష మరింత స్పష్టమవుతుంది. మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్‌లో 6,863 సర్పంచ్ స్థానాలు, 69,450 వార్డు స్థానాలు ఉన్నాయి. అందుబాటులో ఉన్న ఎన్నికల గణాంకాల ప్రకారం 683 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వేలం ఆరోపణల నేపథ్యంలో కొన్ని పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. వాటికి సంబంధించి విచారణ, అధికారిక నిర్ణయాల వివరాలను విడిగా పరిగణించాల్సి ఉంటుంది.

వర్షాలు, వరదల కారణంగా 237 పంచాయతీల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మిగిలిన 5,803 పంచాయతీల్లో పోలింగ్ జరిగింది. అంటే అత్యధిక గ్రామాల్లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏకగ్రీవాల సంఖ్యను మాత్రమే ప్రచారం చేసుకుంటున్న రాజకీయ నాయకులు ఈ వాస్తవాన్ని కూడా గుర్తించాలి. వేలాది గ్రామాల్లో పోటీ జరిగిందంటే అక్కడ గ్రామస్తులు తమ నాయకుడిని తామే ఎన్నుకోవాలనుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ పదవికి ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంటుంది. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రహదారులు, పింఛన్లు, ప్రభుత్వ పథకాల అమలు.. ప్రతి విషయంలోనూ సర్పంచ్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. అందుకే గ్రామస్తులు తమకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకోవాలని కోరుకుంటారు. ఆ అవకాశాన్ని రాజకీయ సర్దుబాట్ల పేరుతో పరిమితం చేయాలనుకోవడం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తుంది.

• అధికారం మారినప్పుడు రాజకీయ ఆధిపత్యం మారొచ్చు!

ఈ పరిణామాలను తాత్కాలిక రాజకీయ విజయాలుగా మాత్రమే చూడాలి. 2021లో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీకి అనుకూలంగా పెద్ద సంఖ్యలో స్థానిక సంస్థల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అప్పట్లో ఆ విజయాలను వైసీపీ నాయకత్వం తమ ప్రజాదరణకు నిదర్శనంగా చెప్పుకుంది. ఇప్పుడు అధికారం మారింది. కూటమి అధికారంలో ఉంది. స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాల రాజకీయ లెక్కలు కూడా మారాయి. నిన్న వైసీపీకి అనుకూలంగా జరిగిన ప్రక్రియలు నేడు కూటమికి అనుకూలంగా కనిపిస్తున్నాయి. అధికారం మారినప్పుడు రాజకీయ ఆధిపత్యం మారవచ్చు. కానీ ప్రజాస్వామ్యంపై ప్రజల అంచనాలు మారవు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమకు ఓటు వేసే అవకాశం ఉండాలని ప్రజలు కోరుకుంటారు. ఏకగ్రీవాలు పార్టీ బలానికి కొంత సూచన కావచ్చు. స్థానిక నాయకుల మధ్య ఉన్న సంబంధాలకు ప్రతిబింబం కావచ్చు. కానీ అవే ప్రజల సంపూర్ణ అభిప్రాయానికి కొలమానం కావు. ఎన్నికల పోటీని ఎదుర్కొని గెలిచినప్పుడే ప్రజా మద్దతు ఎంత ఉందో స్పష్టంగా తెలుస్తుంది. 2029 అసెంబ్లీ ఎన్నికల గురించి ఇప్పుడే ఫలితాలను నిర్ణయించడం రాజకీయ తొందరపాటు అవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను నేరుగా అసెంబ్లీ ఎన్నికలకు అన్వయించలేం. స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిగత బలం, కుల సమీకరణాలు, పార్టీ నాయకత్వం, ప్రభుత్వ పాలన.. అనేక అంశాలు వేర్వేరు ఎన్నికల్లో వేర్వేరు ప్రభావం చూపుతాయి. అయినప్పటికీ ప్రస్తుత పరిణామాలు ఒక హెచ్చరికను మాత్రం ఇస్తున్నాయి. ప్రజల ఓటు హక్కును గౌరవించని రాజకీయ వ్యవస్థకు భవిష్యత్తులో ప్రజలే సమాధానం చెబుతారు. 2024లో వైసీపీ ఎదుర్కొన్న పరాజయం కూడా అధికారంలో ఉన్నంత మాత్రాన ప్రజల మద్దతు శాశ్వతంగా ఉంటుందని భావించకూడదనే పాఠాన్ని నేర్పింది. 2029లో కూటమికి కూడా ప్రజల ముందుకు వెళ్లాల్సిందే. అప్పుడు ఏకగ్రీవాల సంఖ్యను చూపించి ఓట్లు అడగలేరు. చేసిన అభివృద్ధి, ఇచ్చిన హామీలు, అమలు చేసిన సంక్షేమం, ప్రజలతో నెరవేర్చుకున్న సంబంధాలే ఎన్నికల తీర్పును నిర్ణయిస్తాయి. కూటమి నాయకత్వం ఇప్పుడు విజయోత్సవాల కంటే ప్రజల మనోభావాలపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. ఏకగ్రీవంగా గెలిచిన వారిని అభినందించడం తప్పు కాదు. కానీ ఆ ప్రక్రియలో ఎక్కడైనా ఒత్తిళ్లు, బెదిరింపులు, ఆర్థిక ప్రలోభాలు, పదవుల బేరసారాలు చోటుచేసుకున్నాయా అన్నది కూడా పరిశీలించాలి. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి. వేలం ఆరోపణలపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలి. పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు స్వేచ్ఛ కల్పించాలి. ఓటర్లకు ఎలాంటి భయం లేకుండా ఓటు వేసే వాతావరణాన్ని కల్పించాలి. అధికారంలో ఉన్న పార్టీకి ప్రతిపక్షం పోటీగా ఉండటం రాజకీయంగా ఆసౌకర్యం కావచ్చు. కానీ ప్రజాస్వామ్యానికి అది అవసరం. ప్రతిపక్షం బలంగా ఉంటేనే అధికార పార్టీ తన పనితీరును మెరుగుపరుచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పోటీ లేకుండా పదవులు దక్కడం నాయకులకు ఆనందం కలిగించవచ్చు. కానీ ప్రజల భాగస్వామ్యం లేని పాలనకు అది బలమైన పునాది కాలేదు.

• గ్రామాభివృద్ధి పేరుతో ఓటు హక్కు విలువను తగ్గించరాదు

ఈ పరిణామం కూటమికే కాదు.. వైసీపీతో సహా అన్ని రాజకీయ పార్టీలకు ఒక మేల్కొలుపు కావాలి. నిన్న అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ ఏకగ్రీవాలపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సి వచ్చింది. నేడు అధికారంలో ఉన్న కూటమి కూడా అదే పరీక్షను ఎదుర్కొంటోంది. రేపు అధికారం ఎవరి చేతిలో ఉన్నా ప్రజల ఓటు హక్కును గౌరవించాల్సిందే. పదవులు నాయకుల మధ్య పంచుకునే ఆస్తులు కావు. అవి ప్రజలు అప్పగించే బాధ్యతలు. సర్పంచ్ అయినా, ఎంపీటీసీ అయినా, జడ్పీటీసీ అయినా ప్రజల తరఫున పనిచేయాల్సిన ప్రతినిధే. ఆ ప్రతినిధిని ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉండాలి. గ్రామాభివృద్ధి పేరుతో ఓటు హక్కు విలువను తగ్గించకూడదు. రాజకీయ సయోధ్య పేరుతో ప్రజల అభిప్రాయాన్ని పక్కనపెట్టకూడదు. రాయలసీమలో ఇప్పుడు కనిపిస్తున్నది కేవలం ఎన్నికల అనంతర అసంతృప్తి కాదు. ఇది ఓటు హక్కు పట్ల ప్రజల్లో పెరుగుతున్న చైతన్యానికి సంకేతం కూడా. ఓడిపోయిన పార్టీకి ఓటర్లు తిరిగి మద్దతు ఇవ్వవచ్చు. గెలిచిన పార్టీకి దూరమవచ్చు. కానీ తమ ఓటును వినియోగించుకునే అవకాశం కావాలన్న ఆకాంక్ష మాత్రం పార్టీలకు అతీతమైనది. పదవుల కోసం నేతలు బేరసారాలు చేసుకుంటున్నారన్న భావన ప్రజల్లో బలపడితే, రాజకీయ వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుంది. ఆ నమ్మకాన్ని తిరిగి సంపాదించుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలదే. ఏకగ్రీవాల సంబరాలు చేసుకుంటున్న నాయకులు గ్రామాల్లో పేరుకుపోతున్న ఈ కుతకుతను కూడా వినాలి. ప్రజలు డబ్బులు అడగడం లేదు. తమ ఓటును తమ చేతులతో వేయాలనుకుంటున్నారు. తాము ఎన్నుకున్న వ్యక్తి తమకు జవాబుదారీగా ఉండాలని కోరుకుంటున్నారు. పదవులు అమ్ముకునే రాజకీయాల మధ్య ఓటర్లు బలిపశువులుగా మిగిలిపోవడానికి సిద్ధంగా లేరు. ఈ వాస్తవాన్ని గుర్తించడం రాజకీయ పార్టీలకు ఇప్పటికైనా అవసరం. ఎందుకంటే ఎన్నికల్లో గెలుపు తాత్కాలికం కావచ్చు. అధికారం మారవచ్చు. నాయకులు మారవచ్చు. కానీ ఓటు హక్కుపై ప్రజలకు ఉన్న హక్కు మాత్రం శాశ్వతం. ఆ హక్కును గౌరవించినప్పుడే ఏకగ్రీవానికి నిజమైన అర్థం ఉంటుంది. లేకపోతే ఏకగ్రీవాల సంబరాల మధ్య నిశ్శబ్దంగా పేరుకుపోయిన ఓటర్ల అసంతృప్తి.. రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు గట్టి గుణపాఠంగా మారే అవకాశం ఉంది.

వాస్తవ నైజం — భారత్ టుడే BHARAT TODAY My Nation- My Respect

శుక్రవారం 20 నవంబర్ 2026

www.barathtoday.net



- పాదుపు సొమ్ముపై సరికొత్త అధికారం
- రిటైర్మెంట్ తర్వాతా నెలనెలా డబ్బులు
- వ్యక్తిగత ఆర్థిక జీవితంలో కీలక మలుపు!

కొత్త నిబంధనలతో చేతినిండా డబ్బు

ఉద్యోగుల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించే ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఉద్యోగుల వేతనాల నుంచి ప్రతినెలా జమయ్యే ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సొమ్మును అవసరమైనప్పుడు వినియోగించుకునేలా మరిన్ని వెసులుబాట్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాలో తప్పనిసరిగా ఉంచుకోవాల్సిన కనీస నిల్వ పరిమితిని 25 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలని ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) ఆమోదించింది. అలాగే ఉద్యోగ విరమణ తర్వాత తమ పీఎఫ్ సొమ్మును ఒకేసారి తీసుకోవాలా? లేక నెలవారీ, మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి వాయిదాల రూపంలో పొందాలా? అనే సౌలభ్యాన్ని కల్పించే సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ)కు కూడా ఆమోదం తెలిపింది. నవంబర్ 19న కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన న్యూఢిల్లీలో జరిగిన ఈపీఎఫ్ఓ 240వ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాలో ఉన్న మొత్తాన్ని అవసరాల కోసం ఉపసంహరించుకోవాలంటే నిర్దిష్ట పరిమితులు, నిబంధనలు పాటించాల్సి వచ్చేది. కొంత మొత్తాన్ని తప్పనిసరిగా ఖాతాలోనే ఉంచుకోవాల్సి ఉండటంతో అత్యవసర సమయాల్లోనూ మొత్తం సొమ్మును వినియోగించుకునే అవకాశం ఉండేది కాదు. తాజాగా కనీస నిల్వ పరిమితిని తగ్గించడం వల్ల ఉద్యోగులకు తమ పాదుపు సొమ్ముపై మరింత నియంత్రణ లభించనుంది. ముఖ్యంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన ఉద్యోగులు కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, గృహ అవసరాల కోసం తమ సొమ్ములో ఎక్కువ భాగాన్ని వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. అయితే ఈ మార్పులు బోర్డు ఆమోదించిన సంస్కరణలుగా గుర్తించాలి. సంబంధిత పథకాల్లో అవసరమైన సవరణలు, అధికారిక నోటిఫికేషన్ల ప్రకారం అమలు విధానం ఖరారవుతుంది. ఉద్యోగుల పాదుపు సొమ్మును అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వృద్ధాప్య భద్రతను కొనసాగించడమే ఈ మార్పుల వెనుక ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది.

పీఎఫ్ సొమ్ముపై ఉద్యోగులకు ఫుల్ ఫ్రీడమ్

25 శాతం నుంచి 10 శాతానికి..

చేతికి 90 శాతం సొమ్ము!

ఈపీఎఫ్‌వో తీసుకున్న తాజా నిర్ణయాల్లో ఉద్యోగులకు అత్యంత ప్రయోజనం కలిగించే అంశం కనీస నిల్వ పరిమితి తగ్గింపు. గతంలో పీఎఫ్ ఖాతాలోని అర్హమైన మొత్తంలో 25 శాతం తప్పనిసరిగా మిగిలి ఉండేలా నిబంధన ఉండేది. అంటే ఉద్యోగి తన ఖాతాలో ఉన్న అర్హమైన పీఎఫ్ మొత్తాన్ని పూర్తిగా ఉపసంహరించుకునే అవకాశం లేకుండా కనీస నిల్వను భద్రపరచాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ పరిమితిని 10 శాతానికి తగ్గిస్తూ సీబీటీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, వర్తించే ఉపసంహరణ నిబంధనలకు లోబడి ఉద్యోగులు తమ అర్హమైన పీఎఫ్ నిల్వలో గరిష్ఠంగా 90 శాతం వరకు పొందే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ఒక ఉద్యోగి పీఎఫ్ ఖాతాలో రూ.10 లక్షలు ఉన్నాయని భావిస్తే, గత నిబంధన ప్రకారం రూ.2.50 లక్షలు కనీస నిల్వగా ఉంచాల్సి వచ్చేది. మిగిలిన రూ.7.50 లక్షల వరకు మాత్రమే అందుబాటులో ఉండేది. కొత్త విధానం అమల్లోకి వస్తే రూ.1 లక్షను మాత్రమే కనీస నిల్వగా ఉంచి, మిగిలిన రూ.9 లక్షల వరకు అర్హత మేరకు ఉపసంహరించుకునే వెసులుబాటు లభిస్తుంది. అంటే ఒకే ఖాతాలో ఉన్న సొమ్ముపై ఉద్యోగికి అదనంగా రూ.1.50 లక్షల వరకు అందుబాటు పెరిగే అవకాశం ఉంటుంది. అయితే 90 శాతం ఉపసంహరణ అనేది ప్రతి సందర్భంలోనూ ఎలాంటి షరతులు లేకుండా మొత్తం పీఎఫ్ సొమ్మును తీసుకోవచ్చని అర్థం కాదు. ఉద్యోగి వయస్సు, ఉద్యోగ స్థితి, ఉపసంహరణకు కారణం, వర్తించే పీఎఫ్ నిబంధనలను బట్టి అర్హత నిర్ణయిస్తారు. ఈ మార్పు వెనుక మరో ముఖ్యమైన ఉద్దేశం కూడా ఉంది. ఉద్యోగులు తమ డబ్బు కోసం అవసరానికి మించి రుణాలు తీసుకోవడం, అధిక వడ్డీలు చెల్లించడం వంటి పరిస్థితులను తగ్గించవచ్చనే అంచనా ఉంది. ఇంటి అద్దె, పిల్లల విద్య, పెళ్లిళ్లు, ఆసుపత్రి ఖర్చులు వంటి సందర్భాల్లో సొంతంగా పొదుపు చేసుకున్న పీఎఫ్ సొమ్మును ఉపయోగించుకునే అవకాశం పెరుగుతుంది. అదే సమయంలో ఖాతాలో కనీసం 10 శాతం నిల్వ ఉండటం వల్ల భవిష్యత్తు కోసం కొంత మొత్తాన్ని కాపాడుకునే వ్యవస్థ కొనసాగుతుంది. గతంలో 25 శాతం తప్పనిసరి నిల్వ.. ఇప్పుడు 10 శాతం మాత్రమే. ఇదే ఉద్యోగుల చేతికి మరింత డబ్బు అందించే కీలక మార్పు.

రిటైర్మెంట్ తర్వాత కొత్త ఆదాయం.. నెలనెలా పీఎఫ్ డబ్బులు!

ఉద్యోగ విరమణ తర్వాత ఎదురయ్యే అతిపెద్ద సమస్య క్రమమైన ఆదాయం లేకపోవడం. ఉద్యోగంలో ఉన్నంత కాలం ప్రతినెలా జీతం అందుతుంది. కుటుంబ ఖర్చులు, వైద్య అవసరాలు, ఇతర బాధ్యతలను ఆ ఆదాయంతో నిర్వహించుకోవచ్చు. అయితే రిటైర్మెంట్ తర్వాత పీఎఫ్ ఖాతాలో భారీ మొత్తంలో డబ్బు ఉన్నప్పటికీ దాన్ని ఎలా వినియోగించుకోవాలనే ప్రశ్న ఎదురవుతుంది. ఇప్పటివరకు చాలామంది ఉద్యోగ విరమణ సమయంలో తమ పీఎఫ్ మొత్తాన్ని ఒకేసారి ఉపసంహరించుకునేవారు. ఆ తర్వాత ఆ డబ్బును బ్యాంకు డిపాజిట్లు, ఇతర పెట్టుబడుల్లో పెట్టడం ద్వారా నెలవారీ ఆదాయం పొందేందుకు ప్రయత్నించేవారు. కానీ అందరికీ పెట్టుబడులపై సరైన అవగాహన ఉండదు. కొందరు అవసరాలకు మించి ఖర్చు చేయడం వల్ల కొద్దికాలానికే రిటైర్మెంట్ సమయంలో వచ్చిన మొత్తం తగ్గిపోతుంది. మరికొందరు తగిన ఆర్థిక ప్రణాళిక లేకపోవడంతో వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ సమస్యలకు పరిష్కారంగా ఈపీఎఫ్‌వో సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్‌ను తీసుకురావడానికి ఆమోదం తెలిపింది. ఈ విధానం ద్వారా ఉద్యోగ విరమణ చేసిన సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలో ఉన్న సొమ్మును ఒకేసారి తీసుకోకుండా క్రమం తప్పకుండా వాయిదాల రూపంలో పొందవచ్చు. నెలవారీగా, మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి తమకు అవసరమైన విధంగా డబ్బు తీసుకునే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు రిటైర్మెంట్ సమయంలో ఒక ఉద్యోగి ఖాతాలో రూ.30 లక్షలు ఉన్నాయని అనుకుందాం. ఆ మొత్తం మొత్తాన్ని ఒకేసారి తీసుకోకుండా తన అవసరాలకు అనుగుణంగా కొంత మొత్తాన్ని ప్రతి నెలా పొందేలా ఎంచుకోవచ్చు. మిగిలిన సొమ్ము ఖాతాలో కొనసాగుతుంది. అమలయ్యే నిబంధనలను బట్టి ఆ నిల్వపై వర్తించే వడ్డీ ప్రయోజనం కూడా కొనసాగవచ్చు. దీనివల్ల రిటైర్మెంట్ తర్వాత కూడా కొంతకాలం పాటు క్రమమైన నగదు ప్రవాహాన్ని కొనసాగించుకునే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నెలవారీ ఖర్చుల కోసం పింఛను మాత్రమే ఆధారంగా ఉన్నవారికి ఇది అదనపు ఆర్థిక వెసులుబాటు కల్పించవచ్చు. అయితే ఈ సౌకర్యం పీఎఫ్ ఉపసంహరణకు సంబంధించినది. ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్) కింద వచ్చే నెలవారీ పెన్షన్‌కు ఇది ప్రత్యామ్నాయం కాదు. అలాగే వాయిదాల మొత్తం, చెల్లింపుల వ్యవధి, ఎంపిక చేసుకునే విధానం వంటి అంశాలు అధికారిక అమలు మార్గదర్శకాల ద్వారా స్పష్టమవుతాయి. రిటైర్మెంట్ తర్వాత చేతిలో భారీ మొత్తం ఉండటమే కాదు.. అవసరమైనంత డబ్బు క్రమంగా అందేలా చేయడమే ఈ కొత్త పథకం ప్రత్యేకత.

ఉద్యోగం పోయినా ఊరట.. ఉపసంహరణ గడువు 12 నుంచి 2 నెలలకు!

ఉద్యోగం కోల్పోయినప్పుడు ఒక కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు అనేకం. ముఖ్యంగా ప్రైవేటు రంగంలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగం మారే సమయంలో లేదా అనుకోని పరిస్థితుల్లో ఉపాధి కోల్పోయినప్పుడు కుటుంబ ఖర్చులు నిర్వహించడం సవాలుగా మారుతుంది. అటువంటి సమయంలో పీఎఫ్ ఖాతాలో ఉన్న సొమ్ము ఆ కుటుంబానికి ఆర్థిక రక్షణగా నిలుస్తుంది. గతంలో ఉద్యోగం వదిలిన తర్వాత రెండు నెలలు నిరుద్యోగిగా ఉంటే పీఎఫ్ మొత్తాన్ని పూర్తిగా ఉపసంహరించుకునే అవకాశం ఉండేది. అయితే 2025లో తీసుకొచ్చిన మార్పుల ద్వారా తుది పీఎఫ్ సెటిల్‌మెంట్ కోసం వేచి ఉండాల్సిన వ్యవధిని 12 నెలలకు పెంచారు. ఈ నిర్ణయం ఉద్యోగుల దీర్ఘకాలిక పొదుపును కాపాడాలనే ఉద్దేశంతో తీసుకున్నట్లు ప్రభుత్వం వివరించింది. అయితే ఉద్యోగం కోల్పోయిన వ్యక్తులకు ఎదురయ్యే తక్షణ ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు మరోసారి ఈ నిబంధనను సడలించారు. నవంబర్ 19న జరిగిన సీబీటీ సమావేశంలో తుది పీఎఫ్ ఉపసంహరణకు అవసరమైన నిరుద్యోగ నిరీక్షణ వ్యవధిని 12 నెలల నుంచి రెండు నెలలకు తగ్గించేందుకు ఆమోదం లభించింది. అంటే ఉద్యోగం వదిలిన తర్వాత మరో ఉద్యోగంలో చేరకుండా రెండు నెలలు గడిపిన అర్హులైన సభ్యులు తుది సెటిల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు పొందవచ్చు. గతంలో 12 నెలలు వేచి ఉండాల్సి రావడంతో ఉద్యోగం కోల్పోయినవారు ఇతర ఆర్థిక వనరుల కోసం వెతకాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ గడువు తగ్గడం వల్ల కుటుంబ అవసరాల కోసం పీఎఫ్ సొమ్మును త్వరగా పొందే అవకాశం ఏర్పడుతుంది. అయితే ఉద్యోగం మారిన వెంటనే పీఎఫ్ ఖాతాను మూసివేయడం కంటే కొత్త సంస్థలో అదే యూఏఎన్ ద్వారా పీఎఫ్ ఖాతాను కొనసాగించడం దీర్ఘకాలికంగా ప్రయోజనకరం. ఉద్యోగం కోల్పోయిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొత్తం సొమ్మును ఉపసంహరించుకోవాలనే నిబంధన లేదు. తమ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈపీఎస్ కింద పింఛను ప్రయోజనాలకు సంబంధించిన ఉపసంహరణ నిబంధనలు వేరుగా ఉంటాయి. తుది పింఛను ఉపసంహరణకు సంబంధించిన 36 నెలల నిరీక్షణ వ్యవధిని ఈ రెండు నెలల నిర్ణయంతో కలిపి చూడకూడదు. పీఎఫ్ తుది సెటిల్‌మెంట్, పింఛను ప్రయోజనాలు రెండూ వేర్వేరు అంశాలు. ఉద్యోగం కోల్పోయిన సమయంలో ఆర్థికంగా ఆదుకునేలా పీఎఫ్ డబ్బు అందుబాటులోకి రావడం ఈ నిర్ణయంలో మరో ప్రధాన ప్రయోజనం.

ఉద్యోగుల చేతికి డబ్బు.. మార్కెట్‌లో పెరగనున్న చలనం!

ఈపీఎఫ్‌వో తాజా నిర్ణయాలు కేవలం ఉద్యోగుల పీఎఫ్ ఖాతాలకే పరిమితమయ్యే అంశాలు కావు. దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా పరోక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. కోట్లాది మంది ఉద్యోగుల ఖాతాల్లో జమవుతున్న పీఎఫ్ సొమ్ము దీర్ఘకాలిక పొదుపులో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నిధుల్లో కొంత భాగాన్ని ఉద్యోగులు అవసరాలకు అనుగుణంగా ఉపసంహరించుకునే వెసులుబాటు పెరిగితే వారి చేతుల్లో అందుబాటులో ఉండే నగదు కూడా పెరుగుతుంది. ఆ డబ్బు కుటుంబ అవసరాలు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, వినియోగ వస్తువుల కొనుగోలు వంటి రంగాల్లో ఖర్చయ్యే అవకాశం ఉంటుంది. ఫలితంగా రిటైల్ మార్కెట్, గృహోపకరణాలు, రియల్ ఎస్టేట్, విద్యా సేవలు, వైద్య రంగాల్లో కొంత మేరకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాల దగ్గర అదనపు నగదు అందుబాటులో ఉంటే వారు వాయిదా వేసుకున్న కొన్ని కొనుగోళ్లను పూర్తి చేయవచ్చు. చిన్న వ్యాపారాలు, స్థానిక మార్కెట్లు కూడా ఈ ఖర్చుల ద్వారా పరోక్షంగా ప్రయోజనం పొందవచ్చు. అయితే పీఎఫ్ నిబంధనల సడలింపు వల్ల మార్కెట్‌లోకి ఎంత డబ్బు వస్తుంది? దాని వల్ల వినియోగం ఎంత పెరుగుతుంది? అనే అంశాలకు సంబంధించిన నిర్దిష్ట అంచనాలు లేకుండా భారీ ఆర్థిక ప్రభావం ఉంటుందని చెప్పలేం. ఉద్యోగులు తమ పీఎఫ్ మొత్తాన్ని తప్పనిసరిగా ఉపసంహరించుకుంటారని కూడా భావించకూడదు. అవసరం ఉన్నవారే తమ అర్హత మేరకు డబ్బు తీసుకుంటారు. మరికొందరు రిటైర్మెంట్ కోసం మొత్తం పొదుపును అలాగే కొనసాగించవచ్చు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం వెనుక ప్రధానంగా ఉద్యోగుల ఆర్థిక అవసరాలకు స్పందించడం, సామాజిక భద్రతను కొనసాగించడం వంటి అంశాలున్నాయి. మార్కెట్‌లో వినియోగం పెరగడం దాని వల్ల కలిగే పరోక్ష ప్రభావంగా ఉండవచ్చు. మరోవైపు పీఎఫ్ సొమ్ము ఉద్యోగుల వృద్ధాప్యానికి సంబంధించిన పొదుపు కావడంతో అవసరం లేకపోయినా డబ్బు తీసుకోవడం భవిష్యత్తులో ఇబ్బందులకు దారితీయవచ్చు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు మాత్రమే ఉపసంహరణ చేయడం, మిగిలిన మొత్తాన్ని దీర్ఘకాలిక పొదుపుగా ఉంచుకోవడం ఆర్థికంగా మంచిది. ఉద్యోగుల చేతికి అదనపు నగదు రావడం వినియోగానికి ఊతమివ్వవచ్చు. అయితే మార్కెట్ ప్రయోజనాల కంటే ఉద్యోగుల ఆర్థిక భద్రతే ఈ విధానంలో కీలకం కావాలి.

కొత్త విధానం.. ఉద్యోగులు గుర్తుంచుకోవాల్సిన అంశాలివే!

ఈపీఎఫ్‌వో తాజా సంస్కరణలు ఉద్యోగుల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా పీఎఫ్ వ్యవస్థను మార్చే దిశగా తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలుగా నిలుస్తున్నాయి. కనీస నిల్వ పరిమితిని 25 శాతం నుంచి 10 శాతానికి తగ్గించడం, రిటైర్మెంట్ తర్వాత సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ సౌకర్యానికి ఆమోదం తెలపడం, తుది పీఎఫ్ సెటిల్‌మెంట్ కోసం నిరుద్యోగ నిరీక్షణ వ్యవధిని 12 నెలల నుంచి రెండు నెలలకు తగ్గించడం వంటి అంశాలు ఉద్యోగులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. అయితే ఈ మార్పులను అర్థం చేసుకునేటప్పుడు ఉద్యోగులు కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. మొదటగా పీఎఫ్ అనేది కేవలం ఉద్యోగంలో ఉన్నప్పుడు జమ చేసుకునే డబ్బు మాత్రమే కాదు. ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థికంగా ఇతరులపై ఆధారపడకుండా జీవించేందుకు ఉపయోగపడే దీర్ఘకాలిక పొదుపు. అందువల్ల ఖాతాలో డబ్బు అందుబాటులో ఉందని అవసరం లేకపోయినా ఉపసంహరించుకోవడం సరైన నిర్ణయం కాకపోవచ్చు. రెండోది, కొత్త నిబంధనల ప్రకారం 90 శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రతి సభ్యుడికి ప్రతి సందర్భంలోనూ అదే పరిమితి వర్తిస్తుందని అనుకోకూడదు. సంబంధిత ఉపసంహరణ కారణం, అర్హత, అధికారిక మార్గదర్శకాలు కీలకం. మూడోది, రిటైర్మెంట్ తర్వాత నెలవారీగా డబ్బు పొందే ఎస్‌డబ్ల్యూపీ సౌకర్యం అందుబాటులోకి వస్తే ఉద్యోగులు తమ కుటుంబ ఖర్చులకు అనుగుణంగా ముందుగానే ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవచ్చు. నాలుగోది, ఉద్యోగం మారినప్పుడు పాత పీఎఫ్ ఖాతాను కొత్త ఖాతాకు బదిలీ చేయడం ద్వారా సేవా కాలాన్ని కొనసాగించుకోవచ్చు. యూఏఎన్, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు సరిగ్గా ఉండేలా చూసుకోవడం కూడా ముఖ్యం. పీఎఫ్ క్లెయిమ్‌ల విషయంలో తప్పులు, ఆలస్యాలు తగ్గించేందుకు ఈ వివరాలు అవసరమవుతాయి. మరోవైపు ఈపీఎఫ్‌వో తన డిజిటల్ సేవలను విస్తరిస్తూ క్లెయిమ్‌ల పరిష్కారాన్ని వేగవంతం చేసే దిశగా చర్యలు చేపడుతోంది. సీబీటీ సమావేశంలో ఆమోదించిన నిర్ణయాలకు సంబంధించి కేంద్ర కార్మిక శాఖ, ఈపీఎఫ్‌వో అధికారిక ప్రకటనలు, పథక సవరణలను ఉద్యోగులు గమనించాలి. కొత్త సౌకర్యాలు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయి? దరఖాస్తు విధానం ఎలా ఉంటుంది? నెలవారీ చెల్లింపుల పరిమితులు ఏమిటి? వంటి వివరాలు అధికారికంగా వెల్లడైన తర్వాతే వాటి ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. మొత్తంగా చూస్తే పీఎఫ్ వ్యవస్థలో ఉద్యోగులకు మరింత ఆర్థిక స్వేచ్ఛ కల్పించడంతో పాటు భవిష్యత్తు పొదుపును పూర్తిగా దెబ్బతినకుండా కాపాడే ప్రయత్నం ఈ నిర్ణయాల్లో కనిపిస్తోంది. పీఎఫ్ డబ్బు ఉద్యోగుల సొంత పొదుపు. అవసరానికి ఉపయోగించుకోవడం ఎంత ముఖ్యమో.. రేపటి జీవితానికి కొంత మొత్తాన్ని భద్రపరచుకోవడం కూడా అంతే ముఖ్యం.



వాస్తవ నైజం
భారత్ టుడే
BHARAT TODAY
My Nation- My Respect

శుక్రవారం 20 నవంబర్ 2026
www.barathtoday.net



టైమ్100 జాబితాలో వైభవ్
చిన్న వయసులోనే ప్రపంచ గుర్తింపు!

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక 'టైమ్ 100 నెక్ట్స్ -ఇండియా' తొలి జాబితాలో చోటు సంపాదించి దేశం దృష్టిని ఆకర్షించాడు. ఈ సందర్భంగా బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా వైభవ్‌పై ప్రత్యేక ప్రశంసలు కురిపిస్తూ హృదయపూర్వక సందేశం రాశాడు. 14 ఏళ్లకే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించిన వైభవ్.. ఆ తర్వాత రికార్డుల వేటను కొనసాగించాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో అతి పిన్న వయసులో సెంచరీ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. 2026 ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు సాధించి తన బ్యాటింగ్ సత్తా చాటాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అతి చిన్న వయసులో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రత్యేక గుర్తింపు పొందాడు. తాజాగా 15 ఏళ్లకే బిహార్ జట్టుకు నాయకత్వం వహించి టాప్ స్థాయి పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యంత పిన్న వయసు కెప్టెన్‌గా మరో రికార్డు నెలకొల్పాడు. వైభవ్ కేవలం పరుగులు సాధించే ఆటగాడు మాత్రమే కాదని, మారుతున్న భారత యువతకు ప్రతీక అని ఆయుష్మాన్ కొనియాడాడు. ప్రతిభ ఎక్కడి నుంచైనా వెలుగులోకి రావచ్చని అతడి ప్రయాణం నిరూపిస్తోందని పేర్కొన్నాడు. వైభవ్‌తో పాటు హర్మన్‌ప్రీత్ కౌర్, మీరాబాయి చాను, లోవ్లినా బోర్గోహైన్, డి.గుకేశ్, సానియా మీర్జా వంటి ప్రముఖులకు కూడా ఈ జాబితాలో చోటు దక్కింది. చిన్న వయసులోనే ప్రపంచ గుర్తింపు పొందిన వైభవ్.. భారత క్రికెట్ భవిష్యత్తుపై భారీ అంచనాలు పెంచుతున్నాడు.

సిరాజ్‌కు మొండిచేయి
ఎంపికను సమర్థించిన టీమిండియా!

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కకపోవడంపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ స్పందించారు. సిరాజ్‌ను పక్కనపెట్టడంలో ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు. ఐదు రోజుల ఆటను దృష్టిలో పెట్టుకునే అత్యుత్తమ జట్టును ఎంపిక చేశామని వివరించారు. న్యూజిలాండ్ టాప్ ఆర్డర్‌లో నలుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉండటంతో వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం కల్పించామని తెలిపారు. బుమ్రా నేతృత్వంలో భారత్ బౌలర్లు ఆరంభంలోనే నాలుగు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని 60/4తో కష్టాల్లోకి నెట్టారు. అయితే హెన్రీ నికోల్స్ (113 నాటౌట్), గ్లెన్ ఫిలిప్స్ (94 నాటౌట్) అద్భుత పోరాటంతో కివీస్ పుంజుకుంది. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. అన్షుల్ కాంబోజ్ వేగం గంటకు 126-130 కిలోమీటర్ల మధ్య ఉన్నా ఆందోళన అవసరం లేదని కొటక్ సమర్థించారు. ప్రసిద్ధ్ కృష్ణ దూకుడైన బౌలింగ్ శైలిని కూడా వెనకేసుకొచ్చారు. పిచ్‌లో తేమ ఎండిపోవడంతో బౌలర్లకు సహకారం తగ్గిందని, కివీస్ బ్యాటర్లు పరిస్థితులకు చక్కగా అలవాటు పడ్డారని ప్రశంసించారు. సిరాజ్ ఎంపికపై చర్చ కొనసాగుతున్నా, జట్టు నిర్ణయం వెనుక ఐదు రోజుల వ్యూహమే ఉందని కోటక్ స్పష్టం చేశారు.

సిరాజ్ వేటు.. అశ్విన్ సెటైర్ ఇదేనా కొత్త సంప్రదాయం!

సిరాజ్‌ను పక్కనపెట్టడంపై 'చాలా కఠినం.. ఇదే ఇప్పుడు కొత్త సాధారణం' అంటూ ఎక్స్‌లో వ్యంగ్యాస్త్రం సంధించాడు. సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, కుల్దీప్ యాదవ్‌లకు తాను గతంలో మద్దతు పలికింది ఇదే తరహా నిర్ణయాలు సాధారణంగా మారిపోతాయనే భయంతోనేనని మరో పోస్టులో పేర్కొన్నాడు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో 43 వికెట్లతో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన సిరాజ్‌కు చోటు దక్కకపోవడం చర్చకు దారితీసింది. దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ సైతం ఈ నిర్ణయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'సిరాజ్ భారత్‌ను ఎప్పుడూ నిరాశపరచలేదు' అంటూ అతడికి మద్దతుగా నిలిచాడు.



పతనం నుంచి పుంజుకున్న కివీస్..
భారత్‌కు సవాల్!



తొలి రోజు బౌలర్ల ఆధిపత్యం.. చివర్లో కివీస్ ఎదురుదాడి! వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో భారత్, న్యూజిలాండ్ మధ్య ప్రారంభమైన తొలి టెస్టు ఆసక్తికర మలుపులతో సాగింది. పచ్చికతో నిండిన పిచ్‌పై టాస్ గెలిచిన న్యూజిలాండ్ బ్యాటింగ్‌కు దిగగా, భారత పేసర్లు ఆరంభంలో నిప్పులు చెరిగారు. జస్ప్రీత్ బుమ్రా తన పదునైన బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించగా, కివీస్ 70 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇక భారత్ ఆధిపత్యం ఖాయమని భావిస్తున్న తరుణంలో హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుత పోరాటంతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేస్తూ భారత బౌలర్లకు ఎదురొడ్డి నిలిచారు. నికోల్స్ బాధ్యతాయుత శతకంతో జట్టును ఆదుకోగా, ఫిలిప్స్ 94 పరుగులతో అజేయంగా నిలిచి శతకానికి చేరువయ్యాడు. ఇద్దరూ కలిసి ఆరో వికెట్‌కు 173 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. బుమ్రా మూడు వికెట్లతో మెరిసినా, మిగతా బౌలర్లకు చివర్లో వికెట్లు దక్కలేదు. వాషింగ్టన్ సుందర్ పొదుపుగా బౌలింగ్ చేయగా, ప్రసిద్ధ్ కృష్ణ కూడా పోరాడాడు. చివరకు తొలి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. ఒక దశలో కుప్పకూలిన కివీస్ పుంజుకోగా, రెండో రోజు భారత బౌలర్లు మళ్లీ పట్టు సాధిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. మ్యాచ్ ఇంకా సమంగా ఉండటంతో అసలు పోరు ముందుంది!



శాండ్‌పేపర్ వివాదం
ఆసీస్ దిగ్గజాల ప్రతిష్ఠకు దెబ్బ!

2018లో ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసిన శాండ్‌పేపర్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. దక్షిణాఫ్రికా పర్యటనలో బాల్ ట్యాంపరింగ్ ఉదంతంపై కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆస్ట్రేలియా క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లయన్‌ల వ్యక్తిగత ప్రతిష్ఠకు ఈ వివాదం మచ్చగా మారే ప్రమాదముందని అభిప్రాయపడ్డాడు. మైదానంలో వారి ప్రదర్శనలకు వచ్చిన విజయాలు చెక్కుచెదరకపోయినా, వ్యక్తిగత విశ్వసనీయత మాత్రం ప్రశ్నార్థకంగా మారిందని వ్యాఖ్యానించాడు. 2021లో బంతి ఆకారాన్ని మార్చేందుకు ఉపయోగించిన వస్తువు గురించి తమకు తెలియదని ఈ నలుగురు ఆటగాళ్లు చేసిన ప్రకటనను బాన్‌క్రాఫ్ట్ తాజాగా ప్రశ్నించాడు. అప్పటి కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సాకర్‌లకు కూడా ఈ వ్యవహారం తెలుసని బాన్‌క్రాఫ్ట్ ఆరోపించడంతో వివాదం మరింత ముదిరింది.




ఫ్రెండ్స్ గ్యాంగ్ మళ్లీ వచ్చేసింది..
నవ్వుల విందుగా 'ENE Repeat'!

ఎనిమిదేళ్ల క్రితం 'ఈ నగరానికి ఏమైంది'తో తెలుగు యువతను నవ్వుల్లో ముంచెత్తిన ఆ నలుగురు స్నేహితులు.. ఇప్పుడు మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు వచ్చేశారు! తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన 'ENE Repeat' స్నేహం, సినిమా పిచ్చి, అంతులేని అల్లరి కలగలిసిన ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటోంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి తమదైన కామెడీ టైమింగ్‌తో కథకు ప్రాణం పోశారు. తొలి భాగంలో గోవాకు వెళ్లిన ఈ గ్యాంగ్.. ఈసారి థాయ్‌లాండ్ ప్రయాణం కడుతుంది. అక్కడ సర్వైవల్ డ్రామా తీయాలనే ప్రయత్నంలో మొదలయ్యే గందరగోళం, ఈగో గొడవలు, తాగిన మైకంలో జరిగే హంగామా ప్రేక్షకులకు నవ్వుల విందు పంచుతాయి. సినిమా పరిశ్రమలోని మూసధోరణులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల హడావుడి, దర్శకుల కష్టాలు, నటీనటుల ఇమేజ్ చుట్టూ తిరిగే వ్యంగ్యాస్త్రాలు కథకు కొత్త రంగులు అద్దాయి. మధ్యలో మానసిక ఆరోగ్యం, పురుషాధిక్య ధోరణులు, మహిళల ఆశయాల వంటి అంశాలనూ హాస్యంతో మేళవించారు. అభినవ్ గోమఠం తన కామెడీతో ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, విశ్వక్ సేన్ పాత్రలోని అంతర్మథనాన్ని చక్కగా ఆవిష్కరించారు. శ్రీనాథ్ మాగంటి పాత్రలో ఒదిగిపోయారు. వివేక్ సాగర్ సంగీతం, ఏజే ఆరోన్ కెమెరా పనితనం సినిమాకు అదనపు బలం. కొన్ని చోట్ల కథనం సాగదీసినట్లు అనిపించినా, చివరి భాగంలో సినిమా ఇచ్చే అనుభూతి ప్రత్యేకం. 163 నిమిషాల ఈ చిత్రం నవ్విస్తుంది.. భావోద్వేగానికి గురిచేస్తుంది.. స్నేహం విలువను గుర్తుచేస్తుంది. 2026లో తెలుగు సినిమాకు ఒక ఆహ్లాదకరమైన విరామంలా నిలుస్తూ, 'సినిమా అంటే ప్రేమ.. స్నేహం అంటే ప్రాణం' అనే భావనను అందించే వినోదాత్మక ప్రయాణం

వైరల్ వీడియోపై
కీర్తి సురేశ్ క్లారిటీ
మిష్కిన్‌తో బంధంపై బోల్డ్ కామెంట్స్

చెన్నైలో జరిగిన ఓ సినిమా ప్రెస్‌మీట్.. వేదికపై ప్రముఖ దర్శకుడు మిష్కిన్.. ఆయన ప్రశంసలు అందుకుంటున్న నటి కీర్తి సురేశ్! అంతా సాఫీగా సాగుతున్న వేళ, మిష్కిన్ మాట్లాడుతుండగా కీర్తి ఒడికి సమీపంలో ఆయన చేయి తాకిన క్షణం కెమెరాలో రికార్డయింది. అంతే.. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి ఒక్కసారిగా చర్చకు తెరలేపింది. కీర్తి ముఖంలో అసౌకర్యం కనిపించిందంటూ కొందరు నెటిజన్లు కామెంట్లు చేయడంతో వివాదం మరింత వేడెక్కింది. అయితే ఈ ప్రచారానికి కీర్తి సురేశ్ తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. ఓ నెటిజన్ చేసిన పోస్టుకు స్పందిస్తూ.. "నా ముఖంలో అసౌకర్యం ఎక్కడ కనిపించింది? ఆయనతో నాకు తండ్రి-కూతుళ్లలాంటి అనుబంధం ఉందని మేమిద్దరం చెప్పడం వినలేదా? ఒకవేళ నేను అసౌకర్యంగా ఉన్నానని మీరే అనుకుంటే.. సినిమాల్లో నటించే సన్నివేశాల ఆధారంగా బహిరంగ ప్రదేశాల్లోనూ నేను ఏ స్పర్శనైనా అంగీకరించాలని భావిస్తున్నారా?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. దీంతో అసలు వీడియో వెనుక ఉన్న సందర్భంపై స్పష్టత వచ్చింది. కీర్తి వివరణతో స్పందించిన ఆ నెటిజన్ తన పోస్టును తొలగించి, ఎలాంటి చెడు ఉద్దేశం లేకుండానే వైరల్ అవుతున్న వీడియోను షేర్ చేశానంటూ క్షమాపణలు చెప్పారు. ప్రస్తుతం 'అక్క' సినిమా తర్వాత కీర్తి 'సత్యవాన్ సావిత్రి' విడుదలకు సిద్ధమవుతున్నారు. నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో మిష్కిన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సినిమా విడుదలకు ముందు ఈ వీడియో చర్చనీయాంశమైనా, కీర్తి ఇచ్చిన స్పష్టతతో వివాదానికి తెరపడినట్లయింది.





లోన్ వుల్ఫ్'గా రామ్
గన్‌తో గూస్‌బంప్స్ తెప్పించే లుక్!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఈసారి కేవలం హీరోగా కాదు.. మెగాఫోన్ పట్టిన దర్శకుడిగా కూడా బాక్సాఫీస్ బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న #RaPo23 నుంచి విడుదలైన ప్రీ లుక్ ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన ఈ పోస్టర్.. రామ్ కెరీర్‌లోనే విభిన్నమైన పాత్రకు సంకేతంగా నిలుస్తోంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వుల్ఫ్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ లుక్‌లో రామ్ వెనుకవైపు నుంచి కనిపిస్తూ గంభీరమైన భవనం మెట్లపై నిలబడి ఉన్నారు. ఒంటినిండా నలుపు దుస్తులు.. వెనుక భాగంలో ప్రత్యేకమైన వి ఆకారపు హెయిర్‌స్టైల్.. దానిపై టాటూ.. ఒక చేతిలో తుపాకీ, మరో చేతిలో టెడ్డీబేర్! ఈ రెండు విభిన్న వస్తువుల కలయికే పాత్రలోని మిస్టరీని మరింత పెంచుతోంది. ఒంటరిగా తన దారిని తానే ఎంచుకుని, ప్రపంచాన్ని ఎదుర్కొనే స్వతంత్ర వ్యక్తి 'లోన్ వుల్ఫ్' అంటూ మేకర్స్ ఇచ్చిన వివరణ కథానాయకుడి స్వభావంపై ఆసక్తిని పెంచింది. నటుడిగా తనదైన ఎనర్జీతో గుర్తింపు తెచ్చుకున్న రామ్ ఇప్పుడు దర్శకత్వ బాధ్యతను చేపట్టడం ఈ ప్రాజెక్టుకు మరో ప్రత్యేకత. కృష్ణ పోతినేని, రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు ఇది తెలుగు అరంగేట్రం. సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. త్వరలోనే టైటిల్ గ్లింప్స్, ఫస్ట్‌లుక్ విడుదల కానుండటంతో రామ్ సృష్టించబోయే ఈ 'లోన్ వుల్ఫ్' ప్రపంచం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



"ఫ్యూచర్ కిడ్స్.. రెడీగా ఉండండి!"
సోనాక్షి సిన్హా ఫన్నీ కామెంట్!

పెళ్లంటే నాలుగు గోడల మధ్య బంధం మాత్రమే కాదు.. ప్రేమను బహిరంగంగా పంచుకునే అందమైన అనుబంధం కూడా! ఇదే విషయాన్ని తనదైన చిలిపి శైలిలో చెప్పి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన తల్లిదండ్రులు సోనియా గాంధీ, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీల ప్రేమానుబంధం గురించి ఇటీవల చేసిన వ్యాఖ్యలు నెట్టింట చర్చకు దారితీశాయి. నవంబర్ 16న ఢిల్లీలో తల్లి సోనియా రాసిన 'బిలోంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న రాహుల్.. భోజనం చేసే సమయంలో తన తల్లి తండ్రి ఒడిలో కూర్చునేదని, తమ ఇంట్లో అది సహజమైన దృశ్యమని వివరించారు. ఈ వ్యాఖ్యలపై కొందరు విమర్శలు చేయగా, ఓ సోషల్ మీడియా పోస్టును సోనాక్షి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పంచుకున్నారు. ప్రేమగా ఉండే భార్యాభర్తల అనుబంధాన్ని తప్పుగా చూడటంపై ఆ పోస్టు ప్రశ్నించింది. దానికి తనదైన చమత్కారాన్ని జోడిస్తూ.. "నా భవిష్యత్తు పిల్లలకు ఏం ఎదురుకాబోతోందో ఇప్పుడే తెలియదు.. పిల్లలూ, సిద్ధంగా ఉండండి!" అంటూ నవ్వుల ఎమోజీలతో కామెంట్ చేశారు. 2024 జూన్‌లో జహీర్ ఇక్బాల్‌ను వివాహం చేసుకున్న సోనాక్షి, అంతకుముందు ఏడేళ్లపాటు ప్రేమలో ఉన్నారు. జహీర్‌ను తన బెస్ట్ ఫ్రెండ్‌గా అభివర్ణించిన ఆమె, తమ ప్రేమను సోషల్ మీడియాలోనూ తరచూ పంచుకుంటుంటారు. మరోవైపు విమర్శలపై స్పందించిన రాహుల్.. ప్రేమను వ్యక్తం చేయలేని పరిస్థితులకు భయం, ద్వేషమే కారణమని వ్యాఖ్యానించారు. మొత్తానికి రాజకీయ వేదికపై మొదలైన చర్చకు సోనాక్షి చిలిపి కామెంట్ జోడై నెట్టింట నవ్వులు పూయిస్తోంది!

This newspaper is Owned and Published by PENDYALA GOPI from **FLAT NO. 102, RR INFRAS CHARISHMA SQUARE, PLOT NO. 1730 & 1731, OPPOSITE GODAVARI CUTS LANE, PRAGATHI NAGAR, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500090.** Editor: LELLA SIVA PRASAD, Printed at Vision Andhra, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. PRGI REGD No.: TGTEL/26/A6220